4. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 267 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి హితవు

**హైదరాబాద్,మార్చి3 వెలుతురు:**

ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి

- 99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి
- ఈ 99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు
- గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల భగస్వామ్యం ఉండాలి
- కలెక్టర్ల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన



**హైదరాబాద్,మార్చి 3 వెలుతురు:**

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం




ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా



వేసవి డిమాండ్‌కు అనుగుణంగా

## విద్యుత్ ప్రణాళిక

- ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

## మూడు వారాల్లోగా ఇబ్రహింపట్నం మున్సిపల్ ఎన్నిక

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు




**హైదరాబాద్,మార్చి 3 వెలుతురు:**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక పక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి

## 'రాహుల్ గ్రహణం' మూడు సార్లు భారతాన్ని చీకటిలో ముంచేందుకు ప్రయత్నించింది

- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సంకేతాలు ఇవ్వడం దేశంపై ఒక గ్రహణంలాంటిదే.
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు మార్చి 03:**

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సంకేతాలు ఇవ్వడం దేశంపై ఒక గ్రహణంలాం టిదని, 'రాహుల్ గ్రహణం' మూడు సార్లు భారతాన్ని చీకటిలో ముంచేం దుకు ప్రయత్నించిందనీ కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఘాటుగా విమర్శలు చేశారు. ప్రధానమంత్రి కుర్చీ అనేది కుటుంబ వారసత్వం కాదుడ "ఒక చిరునవ్వు, ఒక తలాడింపు"తో బహుమతిగా ఇచ్చేది కాదు. 'రాహుల్ గ్రహణం' మూడు సార్లు భారతాన్ని చీకటిలో ముంచేందుకు ప్రయత్నించింది కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి కిరణాలు ప్రతీసారి వెలుగునిచ్చాయి. ఇది ప్రజాస్వామ్యండ మీ నిజాం శైలి దర్బార్ కాదు.ప్రధానమంత్రి పదవికి ఎలాంటి ఖాళీ లేదు. 140 కోట్ల భారతీయులు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి ఒకసారి కాదు, మూడుసార్లు మద్దతు ముద్ర వేశారు. ప్రజాస్వామ్యంలో ప్రధానమంత్రి పేదల ఓట్లతో ఎన్నికవుతాడుడ హైదరాబాద్ కోర్టీయర్ల




## కెసిఆర్ హోలీ శుభాకాంక్షలు



## తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

వారంలో ఇది రెండోసారి



## కనువిందు చేసిన చంద్రగ్రహణం

ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వీక్షణం



## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

- నార్సింగ్‌లో నిర్మాణంలో ఉన్న వెంచర్ వద్ద ధర్న
- కవిత ధర్నాను అడ్డుకున్న పోలీసులు
- హైడ్రాకు అక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్న



# తెలంగాణలో అప్పు చేయకుండా పూటగడవని స్థితి

- ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ





**హైదరాబాద్,మార్చి 3 వెలుతురు:**

అప్పు చేయకుండా పూటగడవని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి లేఖలో తెలిపారు. ఈ

## రాజ్యసభ రేసులో నలుగురు బిసి నేతలు

ఆ ఇద్దరు ఎవ్వరో నేడు తెలుస్తుంది: పిసిసి చీఫ్



**హైదరాబాద్,మార్చి 3 వెలుతురు:**

రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు

## ఇరాన్ చర్చల ప్రతిపాదన

తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు

ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ వ్యాఖ్య

ఆయుధ నిల్వలపై అనుమానాలొద్దని వెల్లడి

**న్యూయార్క్,మార్చి 3( వెలుతురు):**


ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు

## మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

- ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్

**మహబూబ్‌నగర్,మార్చి3 వెలుతురు:**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత



## ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

- హనుమాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన డిప్యూటీ సిఎం
- అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు
- ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్

**అమరావతి,మార్చి 3 వెలుతురు:**

రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎపి ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవంను మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్



## వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ప్రణాళిక

**హైదరాబాద్,మార్చి3 వెలుతురు:**

మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండిపోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

**హైదరాబాద్,మార్చి 3 వెలుతురు:**

హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. నార్సింగిలోని ఓ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాల్లో తరలిస్తుండగా.. జాగృతి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అంతకుముందు మూసి నది పక్కన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌పై కవిత ఆరోపణలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆ వెంచర్ వద్దే బైఠాయించారు. సాయంత్రం సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ధర్నా కొనసాగించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీని ఆనుకుని భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పేదల ఇళ్లు కూలుస్తూ రియల్ ఎస్టేట్‌వెంచర్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నార్సింగి పరిధిలోని మూసీ నదిని ఆక్రమించి శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. నది పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ వెంచర్ సాగుతోందని ఆమె మండిపడ్డారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సామాన్యుల ఇళ్లను తొలగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ భారీ వెంచర్‌ను ఎందుకు చూడటంలేదని ఆమె నిలదీశారు. పేదల గూడు చెదగొట్టే హైడ్రా అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, కేవలం పేదలపైనే ప్రతాపం చూపడం సరికాదని కవిత హితవు పలికారు. రియల్ ఎస్టేట్ మాఫియా అండతోనే ఇలాంటి భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. సామాన్యుల పక్షాన నిలబడి తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మూడు వారాల్లోగా ఇబ్రహింపట్నం మున్సిపల్ ఎన్నిక

లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

## తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద,మార్చి3 వెలుతురు:**

తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం.ఈ-మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

## కెసిఆర్ హోలీ శుభాకాంక్షలు

**హైదరాబాద్,మార్చి3 వెలుతురు:**

రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో హోలీ కొత్త ఆశలు, విశ్వాసాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరి నడుమ ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండుగగా, హోలీ పండుగ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్నది అని కేసీఆర్ అన్నారు. ఆకులు రాలే శిశిరం నుంచి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ, ప్రకృతిలో నూతనత్వానికి సూచకంగా హోలీ నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఆశలు అడుగంటి ఉన్న తెలంగాణ ప్రజల్లో, కొత్త ఆశలు విశ్వాసాలు తిరిగి పుంజుకోవాలని, ప్రజల నడుమ మరింతగా సహోదరతత్వం పెంపొందాలని హోలీ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

## రాజ్యసభ రేసులో నలుగురు బిసి నేతలు



బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు. నమ్ముకున్న సిద్దాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్దాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

## తెలంగాణలో అప్పు చేయకుండా పూటగడవని స్థితి

మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు.ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి చూస్తే.. 'రాష్ట్ర ఖజానా నిల్.. పార్టీ నాయకుల జేబులు ఫుల్'గా ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.12 లక్షల కోట్లు మేర నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి వివరించారు. ఇందులో పన్నుల వాటా రూ.2.5 లక్షల కోట్లు, రహదారులు రూ.1.85 లక్షల కోట్లు, రైల్వే బ్జడెట్ కేటాయింపులు రూ.36000 కోట్లకు పైగా, రైల్వే పనులకు మరో రూ. 50,000 కోట్లు, ఉపాధి హామీ రూ.40,000 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులు రూ.12,000 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.14,000 కోట్లు, ఉచిత రేషన్ రూ.50,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లు, విద్య.. క్రీడలకు రూ.21,000 కోట్లు, ఆరోగ్య సంరక్షణకు రూ.9,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేందప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో రైతుల నుంచి వరి సేకరణకు రూ.2.6 లక్షల కోట్లు, పత్తి సేకరణకు రూ.60,000 కోట్ల కనీస మద్దుత ధర చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు అందించారని చెప్పారు. 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(ఃూంఃూఅఎ) పథకం కింద వడ్డీ రహిత ఋణాలుగా రూ.10,000 కోట్లు పైగా ఇచ్చి మూలధన ప్రాజెక్టులకు సహకరించారని కేంద్రమంత్రి వివరించారు. ఈ నిధులతో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, మెడికల్- నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లు, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి - మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్‌లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులను ఖర్చు చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్ - ఎఎ కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ.114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ.315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. జీతాలు, సంక్షేమ పథకాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా ఋణాలపై ఆధారపడుతోందని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్ర తలసరి అప్పు పెరుగుతోందన్నారు. 2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పదుతోందని విమర్శించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర బ్జడెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

కల్యాణ్ మాట్లాడుతూ.. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని చెప్పారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ - వన్యప్రాణుల సంఘర్షణను నివారించి, సహాయం అందించే 'హనుమాన్' ఫౌండేషన్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో నేడు కీలకమైన రోజన్నారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ - వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రాజెక్టులో 100 వాహనాలను అటవీ శాఖకు అందించామని పవన్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 19 అత్యవసర సహాయ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఏడు చోట్ల అత్యవసర చికిత్స, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన వారికి 4 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెచ్చి అడవి ఏనుగులను కట్టడి చేశామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉందని ఆయన అన్నారు. హనుమాన్ ప్రాజెక్టును పకడ్బంధీగా రూపొందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ ప్రదర్శనను పవన్ తిలకించారు. అటవీ వన్యప్రాణి సంరక్షణలో పాలుపంచుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖకు రెస్క్యూ వాహనాలు, అంబులెన్సులను డిప్యూటీ సీఎం పవన్ అందజేశారు.

## 'రాహుల్ గ్రహణం' మూడు సార్లు భారతాన్ని చీకటిలో ముంచేందుకు ప్రయత్నించింది

నోట్లతో కాదు!దేశం అభివృద్ధి రంగులతో హోలీ జరుపుకుంటుంటే, కాంగ్రెస్ మాత్రం అవినీతి మసితో మసకబారింది. మీ 'గ్యారంటీలు' మరియు మీ 'యువరాజు' ఆశలను దహనం చేయడానికి దేశ ప్రజలు రాజకీయ హోలికా దహనానికి సిద్ధంగా ఉన్నారు.

ఎంత గులాల్ చల్లినా, దేశం తిరస్కరించిన నాయకుడి వైఫల్యాన్ని దాచలేరు. సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ నవ్వు చూడాలనుకుంటున్నారు. కానీ ఆయన చూడలేకపోతున్నారు హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చివేతల వల్ల కన్నీరు పెట్టుకుంటున్న పేదల బాధ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేతతో భవిష్యత్తు అడ్డుకుపోయిన విద్యార్థుల ఆవేదన రైతు భరోసా ఖాళీ హామీలతో మోసపోయిన రైతుల కన్నీళ్లు మూసీ పునరుజ్జీవన పేరుతో ఇల్లు కోల్పోతున్న కుటుంబాల వేదన హామీలు నెరవేరక, పెన్షన్లు, లబ్ధులు కోసం ఎదురుచూస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు మరియు ప్రజల నిరాశ రేవంత్ రెడ్డి గారికే తెలుసు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాలేరని. కాబట్టి భజన ఆపి, తన బాధ్యతపై దృష్టి పెట్టాలి.

## ఇరాన్ చర్చల ప్రతిపాదన

సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు. ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు.



'అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి' అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. ఇరాన్‌పై దాడుల గురించి కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు)కు ట్రంప్ అధికారికంగా వెల్లడించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధ్యక్షుడు సమర్థించుకున్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్లు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

## కనువిందు చేసిన చంద్రగ్రహణం

**న్యూఢిల్లీ,మార్చి 3 వెలుతురు:**

ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చందగ్రహణం కనువిందు చేసింది. చందగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో ప్రకాశవంతంగా మెరిసిపోయింది. భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియాల్లో సంపూర్ణచందగ్రహణం స్పష్టంగా కనిపించింది. ఆయా దేశాల్లో రక్తవర్ణంలో కనువిందు చేసిన చంద్రుడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చందగ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలు ప్రారంభమయ్యింది. సాయంత్రం 4.34 గంటలకు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడింది. 5.33 గంటలకు సంపూర్ణ చందగ్రహణం వీడింది. అయితే, 6.47 గంటలకు గ్రహణం వీడుతుందని తెలిపారు.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కనిపించిన ఈ సంపూర్ణ చందగ్రహణం మన దేశంలో మాత్రం కొన్ని చోట్ల మాత్రమే కనిపించింది.

## మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# తెలంగాణఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది





**వికారాబాద్ వెలుతురు మార్చి 03:**
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుల కోసం నిర్వహించిన పది రోజుల శిక్షణ శిబిరం మార్చి 2వ తేదీన విజయవంతంగా ముగిసింది. ఫిబ్రవరి 21న ప్రారంభమైన ఈ శిబిరాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మా మహేశ్ కుమార్ గౌడ్ గారు, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు శర్మిల రెడ్డి గారు ప్రారంభించారు. శిబిరం విఖారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించబడింది. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమై వందే మాతరం ఆలపించేవారు. అల్పాహారం అనంతరం ఉదయం 10 గంటల నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యేవి. రోజుకు మూడు సెషన్లుగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, 1.30 నుంచి 4 వరకు, 4.30 నుంచి 7.30 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ శిబిరంలో ముఖ్యంగా పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల వరకు ఎలా బలోపేతం చేయాలన్న అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. సోషల్ జస్టిస్, దేశ రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యూహాలు వంటి కీలక అంశాలపై విశ్లేషణ జరిగింది. ప్రారంభ రోజునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ గారు తమ అనుభవాలను పంచుకున్నారు. అదేవిధంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క తమ అనుభవాలను వివరించారు. అలాగే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్ కొప్పుల రాజు, సామాజికవేత్త కోదండరాం, అరుణ్ శర్మ, జాన్ బైకేల్, శాంతా సిన్హా పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో భాగంగా ఒక రోజు గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించి, అనంతగిరి సమీపంలోని గ్రామాలకు వెళ్లి అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే మనరేగా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం కూడా చేశారు.
ఈ శిక్షణ శిబిరాన్ని ఏఐసీసీ ట్రైనింగ్ విభాగం అధ్యక్షులు సచిన్ రావు నేతృత్వంలో, రాష్ట్ర ఇంచార్జ్ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. చివరి రోజున ముఖ్య అతిథిగా వచ్చిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఉదయం వికారాబాద్ చేరుకుని, పీఏసీ నాయకులతో భేటీ అయ్యారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, సుమారు రెండు గంటలపాటు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ రాజకీయ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం వంటి అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, భద్రతా నియమాలను పక్కనపెట్టి అందరితో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రసన్న కుమార్ శర్మ, గంప గోపాల్, ప్రవీణ్ కుమార్ కలిసి రాహుల్ గాంధీ గారికి భారత రాజ్యాంగ ప్రతిని అందజేసి ఆశీర్వాదాలు పొందారు.
అదేవిధంగా రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన బుక్లెట్‌ను అందించారు. మొత్తంగా, ఈ పది రోజుల శిక్షణ శిబిరం జిల్లా అధ్యక్షులకు స్ఫూర్తి, దిశానిర్దేశం మరియు కార్యాచరణ ప్రణాళికను అందించిన కీలక కార్యక్రమంగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి , పార్టీ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ,గంప వేణుగోపాల్,ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు కి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే మీ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

# ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

- మోడీ తీరుతో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట
- మోడీ తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,మార్చి 3 వెలుతురు:**
అమెరికా–ఇజ్రాయిల్–ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా–ఇజ్రాయిల్–ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.ం

# ఖమేనీ హత్యపై మౌనమెందుకు?

- మోడీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ



**న్యూఢిల్లీ,మార్చి3 వెలుతురు:**
ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసపినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాం÷–రతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

# అమెరికాలో భారత యువతి హత్య

- ఇరాన్ ఉగ్ర కుట్రపై పోలీసుల ఆరా

**న్యూయార్క్,మార్చి 3( వెలుతురు):**
ఆస్టిన్‌లో (టెక్సాస్) ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో భారతీయ యువతి సహా ముగ్గురు మరణించడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ కాల్పుల ఘటన వెనుక ఇరాన్ ఉగ్ర కుట్ర ఉందా అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వెస్ట్ సిక్స్త్ వీధిలో బ్యూఫోర్డ్ బార్న్ వద్ద ఈ ఘటన జరిగింది. నిందితుడు విచక్షణా రహితంగా కాల్పులకు దిగడంతో ముగ్గురు మరణించగా 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఇక నిందితుడు కూడా పోలీసులు కాల్పుల్లో మరణించాడు. దీంతో, మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాల్పులకు బలైన భారతీయ యువతిని సవిత షన్ముఖ సుందరంగా పోలీసులు గుర్తించారు. ఆమె యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుకునే వారు. మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఎకనమిక్స్‌లో డ్యూయెల్ డిగ్రీతో ఆమె చదువు మే నెలలో పూర్తి కావాల్సి ఉంది. ఇంతలోనే ఆమె కన్నుమూశారు. సవిత మృతిపై యూనివర్సిటీ వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. తమ యూనివర్సిటీలోని సూపర్ స్టార్ స్టూడెంట్స్‌లో ఆమె కూడా ఒకరని అక్కడి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. చదువు పూర్తయ్యాక ఆమె ఒక ప్రముఖ సంస్థలో చేరాల్సి ఉండగా ఈ ఘోరం జరిగిందని విచారం వ్యక్తం చేశారు.

# జాతీయ పోలీస్ అకాడమీని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

## కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ (CISR) ప్రారంభ కార్యక్రమాన్ని తిలకించిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 03:**
కేంద్ర హోం శాఖ రాష్ట్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం రోజున సాయంత్రం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ (జ×ూ=) ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుండి అమరుల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం నేషనల్ పోలీస్ అకాడమీలోని మౌలిక వసతులను సందర్శించారు. సైబర్ ల్యాబ్ & సైబర్ ఎక్స్ ల్యాబ్ ను సందర్శించిన కేంద్ర మంత్రి సైబర్ ల్యాబ్ ద్వారా ఎవరెవరికి ఎలాంటి శిక్షణను అందిస్తున్నారని, ఏయే కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్, కౌంటర్ టెర్రరిజం. డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ దాడులను ఎలా అడ్డుకోవడం వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ (జ×ూ=) ప్రాజెక్ట్‌పై అధికారులు కేంద్ర మంత్రికి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రెజెంటేషన్ అనంతరం సీపీడబ్ల్యూ అధికారులు, వర్క్స్ & అవుట్‌డోర్ సిబ్బందికి స్మారక చిహ్నాలను ప్రదానం చేశారు. అకాడమీ బోర్డ్ రూమ్‌లో శిక్షణ కార్యకలాపాలపై ప్రదర్శనను తిలకించారు. కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ కార్యక్రమం ద్వారా దేశ పోలీసు దళాల శిక్షణా మౌలిక వసతులను బలోపేతం చేయడం, ఆధునిక షూటింగ్, సైబర్ సామర్థ్యాలను పెంపొందించడం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.











# సంపాదకీయం..

# హర్మూజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !

పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా,అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్మూజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్ల చమురు హార్మూజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్‌జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్మూజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది.





ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హార్మూజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్మూజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుంద నుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

## హర్మూజ్ జలసంధి మూసివేత

**- ఎవరైనా వెళితే పేల్చేస్తాం**

**- ఇరాన్ వార్నింగ్‌తో చమురు సంక్షోభం**




**టెహ్రాన్,మార్చి3( వెలుతురు):**
పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే ముడిచమురు ధరలు పెరుగుతుండగా.. ఇరాన్ ఇచ్చిన వార్నింగ్ మరింత ఆందోళనకు దారితీస్తోంది. హోర్ముజ్ జలసంధి ని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి ప్రయత్నిస్తే నిప్పు పెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపైనైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. హోర్ముజ్.. ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయం అయినా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజ లాడిస్తుంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇంతటి కీలకమైన జలసంధి మూసుకుపోతే.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటికే ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు భగ్గుమంటు న్నాయి. కాగా.. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో తమ సుప్రీంనేత ఖమేనీ మృతి చెందడంతో ఇరాన్ రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే హోర్ముజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. సుమారు 150 ఆయిల్ ట్యాంకర్లు ఇప్పటికే ఈ హోర్ముజ్ నుంచి వెళ్లేందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు హోర్ముజ్ తూర్పువైపున 60 ట్యాంకర్లు వేచిచూస్తున్నాయి. ఇదిలాఉంటే, ఫిబ్రవరి మధ్యలో సైనిక విన్యాసాల కోసం జలసంధిలో కొంతభాగాన్ని ఇరాన్ మూసివేయగా.. అప్పుడు చమురు ధరలు 6 శాతం మేర పెరిగాయి.

## తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

**- అమెరికా నెత్తిన భారీగా భారం పడడం ఖాయం**

**- ఇప్పటికే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు**

**వాషింగ్టన్,మార్చి3( వెలుతురు):**
'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట. అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియా లో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత అన్న భయాలు కలుగుతున్నాయి. ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బ్జడెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం.

## విరుచుకు పడుతున్న ఇరాన్

**- బహ్రాయిన్‌లో యూఎస్ ఎయిర్‌బేస్ ధ్వంసం**

**టెహ్రాన్,మార్చి3( వెలుతురు):**
పశ్చిమాసియాలో తాజా ఘర్షణలు నాలుగో రోజుకు చేరాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ప్రాంతంలోని అమెరికా ఎయిర్‌బెస్‌ను ధ్వంసం చేశామని మంగళవారం ఇరాన్ ప్రకటించుకుంది. డ్రోన్లు, క్షిపణులతో కమాండ్ సెంటర్, కేంద్ర కార్యాలయాన్ని దెబ్బతీశామని వెల్లడించింది. 20 డ్రోన్లు, మూడు క్షిపణులతో టా÷-గ్గ÷ట్లను ఢీకొట్టాం. దాంతో ఆ ప్రాంతంలో ఇంధనాన్ని నిల్వ చేసే ట్యాంకులకు మంటలు అంటుకొని ఆ ప్రాంతమంతా పొగ అలముకుందని ఇరాన్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని రమాత్ డేవిడ్ ఎయిర్‌బేస్‌పై దాడి జరిగినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. రాడార్ కేంద్రాలు, కంట్రోల్ రూమ్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. అందుకోసం డ్రోన్ల గుంపును పంపినట్లు పేర్కొంది. ఇదిలాఉంటే.. బీరుట్ దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు చేసింది. ఎరుపు రంగు మార్కింగ్‌లో ఉన్న భవనాలు, ఆ పక్కనే ఉన్న ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలి. కనీసం 300 మీటర్లు దూరంగా వెళ్లండి. ఆ భవనాలన్నీ హెజ్‌బొల్లా స్థావరాలకు దగ్గర్లో ఉన్నాయని ఇజ్రాయెల్ పేర్కొంది.

## ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

**- ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించినట్లు ప్రచారం**

**- కమేనీ కదలికలను గుర్తించి..పక్కాగా బాంబింగ్**

**వాషింగ్టన్,మార్చి3( వెలుతురు):**
ఆధునిక యుద్ధవిద్యలో ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం సాధించాయని విదేవీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టా÷-గ్గ÷ట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి



ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

## ఆరుట్ల గ్రామంలో ఘనంగా కామదహన కార్యక్రమం



**మంచాల వెలుతురు మార్చి 03:**
మంచాల మండలం హోళీపండుగ సందర్భంగా ఆరుట్ల గ్రామంలోసోమవారం రాత్రి ఆరుట్ల గ్రా మపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో కామదహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ముందుగా కామ ద హనానికి ప్రత్యేక పూజలు చేసిన గ్రామ సర్పంచ్ మాని పాటి శోభ కు మార్ ఉప సర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ అంతరం కామదహనం చేశారు ఈకార్యక్రమంలో గ్రామపం చాయతీ వార్డు సభ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ ఆనంగల్ల జగన్నాథం మంకు మమత వి నోద్ మంద మాధవి మోహన్ రెడ్డి పున్నం రాము రావుల జంగయ్య మానిపాటి భాను ప్రసాద్ మాడుగుల బాలమని కృష్ణ గౌడ్ మొర్రి పద్మఐలయ్య మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ లాలగారి మణె మ్మ సాతిరిసత్యం వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొని కామదహన కార్యక్రమం విజయవంతం చేశారు

## హోలీ సంబరాల్లో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్



**మంచాల వెలుతురు మార్చి 03:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఘనంగా హోలీ వేడుకలు పాల్గొన్న ప్రజాసంఘాల అధ్య క్షులు కంబాలపల్లి భాస్కర్ హోలీ పండుగలో కులాల మతాలకు అతీతంగా జరు పుకునే పెద్ద పండుగ అందరూ కూ డా ఘనంగా హోలీ పండుగ వేడుక లు జరుపుకోవాలని ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతోటి సుఖసంపదలతోటి వర్ధిల్లాల ని ఆదేవుడిని కోరుకున్నారు కార్యక్ర మంలో చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ




**కుషాయిగూడ,మార్చి 3 వెలుతురు:**
జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి కృషి చేస్తానని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ (రిజి. నెం. 489/2020) ప్రతినిధులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఎంపీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడిన ఆయన, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్ర మూర్తి, సలహాదారులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, యావపురం రవి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ కి మేయర్ పరామర్శ.



**కరీంనగర్ వెలుతురు మార్చి 03:**
కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ మంగళవారం రోజున హరీష్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానికనాయకులు, కార్యకర్తలకు మేయర్ కోలగని శ్రీనివాస్ ఈ సందర్భంగా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కేంచ శేఖర్, జిల్లా నాయకులు ఎర్రోళ్ల ప్రదీప్, ప్రధాన కార్యదర్శి కొప్పుల హరిప్రసాద్, గొపు మునీదర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## నాచారంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఘనంగా హోళీ వేడుకలు



**నాచారం వెలుతురు మార్చి 03:**
నాచారంలోని రాఘవేంద్ర నగర్ లో హోళీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హోళీ వేడుకల్లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా విద్యార్థిని విద్యార్థులు అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలియజేసుకున్నారు.

# ఘనంగా హోలీ సంబరాలు

**- రంగుల హోరులో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహణ**



**శంకర్పల్లి వెలుతురు మార్చి 3 :**
శంకర్పల్లి మున్సిపల్ సింగపూర్ వార్డులో హోలీ పండుగను ప్రజలు ఘనంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచే వీధులు, కాలనీలు రంగుల మయం అయ్యాయి. యువత ప్రత్యేకంగా డీజే పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పలుచోట్ల స్థానిక సంఘాలు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, సహపంక్తి భోజనాలు నిర్వహించాయి. పిల్లలు పిచ్కారీలతో రంగులు చల్లుతూ సందడి చేశారు. పెద్దలు సంప్రదాయ పద్ధతిలో హోలీ పూజలు నిర్వహించి, శాంతిసౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. అయితే పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు హెచ్చరించారు. పర్యావరణ హిత హోలీ జరుపుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రసాయన రంగుల బదులుగా సహజ రంగులను వినియోగించాలని సూచించారు. నీటి వృథా నివారించాలని కూడా కోరారు.

## దొంతాన్పల్లి పంచాయతీకి తాత్కాలిక కార్యదర్శి నియామకం

**శంకర్పల్లి, వెలుతురు మార్చి 03:**
మండలంలోని దొంతాన్పల్లి గ్రామ పంచాయతీకి తాత్కాలిక ఇన్చార్జ్ పంచాయతీ కార్యదర్శిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం (పిడబ్ల్యూ) ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ఇక్కడ కార్యదర్శిగా డిప్యుటేషన్లో పని చేస్తున్న ప్రవీణ్కళ్యాణ్ను కొండకల్కి డిప్యుటేషన్పై బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో దొంతాన్పల్లి గ్రామ పంచాయతీ పనులు అంతరాయం కలగకుండా కొనసాగేందుకు ప్రొద్దటూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ను ఇన్చార్జ్ గా నియమించారు.

**ప్రవీణ్ కళ్యాణ్ పై అవినీతి ఆరోపణలు**

దొంతాన్పల్లి కార్యదర్శి ప్రవీణ్కళ్యాణ్ పై గ్రామ ప్రజలు, పంచాయతీ పాలక వర్గం తీవ్ర అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న ఇళ్లకు మళ్లీ ఇంటి నెంబరు కేటాయించి లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలను నిలిపివేయకుండా అధికారిక అనుమతి రుసుములు ప్రభుత్వ ఖజానాకు చెల్లించకుండా వ్యక్తిగతంగా తీసుకున్నాడని, ముఖ్యంగా 111 జీఓ పరిధిలో ఉన్న నిర్మాణాలకు కూడా ఇంటి నెంబరు కేటాయించి నిబంధనలను బేఖాతరు చేస్తున్నాడని పేర్కొంటున్నారు. ఈ విషయాలపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేస్తే వారిని బెదిరిస్తూ తనకు ఉన్నత స్థాయి పరిచయాల వల్ల నన్నెవరూ ఏమీ చేయలేరని కార్యదర్శి వ్యాఖ్యానించాడనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్తులు, పాలకవర్గం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరారు.

# ఏప్రిల్ ఒకటి 2026 నుంచి దేశ వ్యాప్తంగా జరిగే కుల గణనలో బీసీలను చేర్చాలి

**- బీసీలను లెక్కించకుంటే కులగణను బహిష్కరిస్తాం**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**మిర్యాలగూడ వెలుతురు మార్చి 03:**
2026 ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా జరగనున్న జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో జరిగిన సమావేశంలో లింగంగౌడ్ మాట్లాడుతూ 1931 సంవత్సరంలో జరిగిన కులగణన తర్వాత బీసీల మూడు దశాబ్దాల పోరాట ఫలితంగా గత సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన జనగణతో పాటు కులగణను కూడా చేపడతామని నిర్ణయం తీసుకున్నారని కానీ జనవరి 22, 2006 రోజున కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 33 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఈ నోటిఫికేషన్ లో 12వ ప్రశ్న లో మీరు ఎస్సీనా, ఎస్టినా లేదా మీరు ఇతరుల అని అడిగిందని ఇతరులు అన్నచోట ఓబీసీ నా అని ప్రశ్నావళిలో అని అడిగితే కేంద్ర ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏముందని జాజుల ప్రశ్నించారు. ఓబీసీ కాలాన్ని ప్రత్యేకంగా చేర్చక పోవడం మూలంగా దేశవ్యాప్తంగా ఉన్న 70 కోట్ల మంది బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో తేలుకుంటే బడ్జెట్, విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా ఒక హక్కుగా చట్టబద్ధంగా దక్కకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కులగణను కూడా చేర్చాలని లేకపోతే దేశవ్యాప్తంగా జరిగి కులగణను బహిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ధోనీటి శేఖర్ నక్క నాగరాజు బొమ్మకంటి హరి మహేశ్ వంశీ శ్రీనివాస్ యాదవ్, రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నార్

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి






**ఎల్బీనగర్, వెలుతురు మార్చి 03:**
ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టిపిసిసి ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ్ ఫస్ట్ లేడీ ఉప్పల స్వప్న ఆధ్వర్యంలో నాగోల్ లోని శుభం గార్డెన్స్ లో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,మల్ రెడ్డి రంగారెడ్డి, హీరోయిన్ కవిత ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ..మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఒకవైపు కుటుంబం, మరోవైపు ఉద్యోగ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. సమాజ గమనంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, వారు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుతున్నారని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వారు అభిప్రాయపడ్డారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ..మహిళలు కుటుంబం మాత్రమే కాకుండా దేశ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్య, ఉపాధి, రాజకీయాలు, వ్యాపార రంగాల్లో వారు సాధిస్తున్న విజయాలు గర్వకారణమని పేర్కొన్నారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి పునాది అని ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఆ పథకాల ద్వారా ఆర్థిక స్వావలంబన, విద్యా అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, తమ హక్కులను తెలుసుకొని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో మెగా తంబోలా నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, సినీ నటులు, మహిళామణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్స్ వద్ద ధర్నా

**హైదరాబాద్,మార్చి 3( వెలుతురు):**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్ పెదరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. క్రీడాకారులకు అన్యాయం చేసి, ప్రైవేటు వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. విశాక ఇండస్ట్రీస్కు బదిలీ చేసిన రూ.68.73 కోట్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను హెచ్సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ ఖండించారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏ




చెక్కులపైనా సంతకాలు చేయలేదన్నారు. రూ.68.73 కోట్లు హెచ్సీఏ నుంచి కంపెనీకి చెల్లింపులో తన ప్రమేయం లేదన్నారు. తాను బాధ్యతలు తీసుకోకముందే చెల్లింపుల ప్రాసెస్ జరిగిందని చెప్పారు. డబ్బులు చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు అమర్నాథ్ పేర్కొన్నారు.

## సెయింట్ పీటర్స్ నాచారం స్కూల్ విద్యార్థులు ఘనంగా హోళీ వేడుకలు



**నాచారం వెలుతురు మార్చి 03:**
నాచారంలోని సెయింట్ పీటర్స్ స్కూల్ విద్యార్థులు జాజుల వర్షిణి శ్రేష్ట చైత్రిక హోళీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హోళీ వేడుకల్లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా విద్యార్థిని విద్యార్థులు అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలియజేసుకున్నారు.

## సహనం, దానం, మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**- బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 03:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ లో మైనారిటీ నాయకులు ఎండీ.ఆజమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న సంస్కృతుల సంఘమం హైదరాబాద్ నగరం అని అన్నారు. మతసామరస్యాన్ని చాటెది ఇఫ్తార్ కార్యక్రమమన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, వివిధ డివిజన్లకు చెందిన నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సూరారంలో హోలీ పండుగ పూట విషాదం ఇద్దరు యువకులు మృతి




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 03:**
సూరారంలో హోలీ పండుగ పూట విషాదం నెలకొంది. ఈతకెళ్లిన ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మంగళవారం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హోలీ పండుగ అనంతరం స్నానం చేయడానికి ఐదుగురు స్నేహితులు చెరువు వద్దకు వెళ్లారు. ముగ్గురు యువకులు షాంపూ తీసుకురావడానికి సమీప దుకాణానికి వెళ్లగా మిగిలిన ఇద్దరు చెరువులోకి దిగి స్నానం ప్రారంభించారు. ఆ ఇద్దరు చెరువులోకి దిగి స్నానం చేస్తుండగా లోతైన ప్రాంతంలోకి వెళ్లిన సాగర్ (17), అభిషేక్ (17), సంవత్సరాలు ఊపిరాడక నీటిలో మునిగిపోయారు. తోటి స్నేహితులు గమనించే లోపే వారి లోతులోకి జారిపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారం మేరకు సూరారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని టిఆర్ఎస్ బృందం సహాయంతో మృతదేహాలను చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సూరారం సిఐ సుధీర్ కృష్ణ వివరాలను వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

# ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించిన సర్పంచ్ విక్రమ్

**- హోలీ సంబరాలలో పాల్గొన్న గర్దాస్ విక్రమ్ సర్పంచ్**





**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 03:** పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూగ్రామ పెద్దలు,వివిధ పార్టీ ల నాయకులు,మహిళలు, యువకుల తో చిన్నారులతో,వివిధ రంగులతో మోదుగు పూలతో హోలీ వేడుకలు ఘనంగా డీజే చప్పుళ్లతో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్ వరికుప్పల స్వామి, యువనాయ కులు సింగణబోయిన గణేష్ యాదవ్, చిన్నపాక శ్రీనివాస్, సింగణబో యిన జంగయ్య,మందడి విధ్యాసాగర్ రెడ్డి,మందడి శ్రీధర్ రెడ్డి,కాటపల్లి సిద్ధమ్మ యాదయ్య,రేపాక సత్తయ్య, రాస వెంకటేష్, రవ్వ నర్సింహా, రాజన్నగారి రమేష్,మంటి లింగస్వామి, మంటి రమేష్,గోళ్లేపల్లి యాదయ్య,చిన్నపాక సురేష్, బొల్లనర్సింహా, బొల్ల మచ్చి, కంబాలపల్లి శ్రీశైలం, నక్క వెంకటేష్, కొమ్మగోని సంజీవ,జిట్టబోయినవెంకటేష్, బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, బోనగిరి సంజీవ,గర్ధాస్ శ్రీకాంత్, గడ్డం సాయి, గర్ధాస్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పిన్నాయిపాలెం పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**సూర్యాపేట వెలుతురు మార్చి 03:** సూర్యాపేట మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పిన్నాయిపాలెం నందు స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల సిబ్బంది కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు విధులను చక్కగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులుగా నెమ్మాది రిషి,పీఈటీగా చెనగోని యశ్వంత్,ఉపాధ్యాయులు గా కొరివి ప్రణవి,చింత జెస్సిక,చింతలచేరి సౌమ్య శ్రీ,నెమ్మాది రిషిత,చింత అన్షు లు ఒక్క రోజు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా తమ పాత్రలలో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల పాత్రలలో విద్యార్థులు ఎంతో చాక చక్యాన్ని,చురుకుదనాన్ని ప్రదర్శించారు.విద్యార్థినీ విద్యార్థులు నిర్వర్తించిన బాధ్యతల ప్రకారంగానే భవిష్యత్తులో వారి కలల్ని సాకారం చేసుకోవాలని,విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని ఆ లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని బాల్యం నుండి విద్యార్థులు కష్టపడి ఒక ప్రణాళికను ఏర్పరచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉయ్యాల ప్రసాద్, ఉపాధ్యాయులు తోట సరళ కస్తూరి కిషన్ ప్రసాద్,కక్కిరేణి సురేష్ కుమార్, కడారి రాఘవులు,చింత మానస తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 03:**



మండలం వెల్లంకి గ్రామంలో ఆవనగంటి గోపాల్ట 60 ఊ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల మహేందర్ రెడ్డి 10,000 రూపాయలు మరియు గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ 5,000 రూపాయలు అవనిగంటి గోపాల్ కుమారుడైన ఆమనగంటి మహేష్ ట గ్రామపంచాయతీ సిబ్బంది ఊ కు ఆర్థిక సాయం అందజేసి గోపాల్ మృతదేహానికి నివాళలు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎడ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గోపాల్ మరణించడం చాలా బాధాకరమని, ఆవనగంటి మహేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాజకుమార్, బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఈడెం శ్రీనివాస్, వార్డు సభ్యులు సండ్ల లింగయ్య మరియు పాశం సతీష్ రెడ్డి జింక శేఖర్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపురం గ్రామంలో ఘనంగా గౌడ వనభోజనాలు





**మునుగోడు వెలుతురు మార్చి 03:** మంగళవారం రోజున కిష్టపురం గ్రామంలో దేశంలో స్టేట్ లో జిల్లాలో మండలంలో ఎక్కడా లేనివిధంగా గౌడ సంఘం సభ్యులు అందరూ ఒకటే వాళ్లకు సంబంధించిన ఈత వనంలో సంఘం సభ్యులందరికీ నిర్వహించిన వాన భోజనాల్లో భాగంగా వీరికి కిష్టాపురం గ్రామ గౌండ్ల సంఘం సభ్యులు అందరూ ఒక తాటిపై వచ్చి ఉండాలని అందరు కోరుకుంటున్నారు ఇట్టి కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సురిగి నరసింహ గౌడ్ కి గౌండ్ల సంఘం అధ్యక్షుడు జాజుల నరసింహ గౌడ్ లింగాల సాయి మునుకుంట్ల శ్రీనివాస్ గౌడ్ గౌడ్ మారగోని చంద్రం మునుకుంట్ల నరసింహ పంతంగి రాజు మునుకుంట్ల గోపాల్ జాజుల ప్రభాకర్ సురిగి మైసూర్ మునుకుంట్ల మల్లయ్య గౌడ్ బలరాం గౌడ్ వేముల నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవం

**- జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీక**

**- యూనియన్లకు అతీతంగా వేడుక**




**ఖమ్మం, వెలుతురు మార్చి 03:** ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళ వారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని వివిధ జర్నలిస్టు




యూనియన్లకు చెందిన సీనియర్, జూనియర్ విలేకరులు, జర్నలిస్టు నేతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తొలుత ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ మోత్కూరి వెంకటేశ్వర్లును స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ వేడుకల సందర్భంగా 5 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి జర్నలిస్ట్ లకు పంచిపెట్టారు. స్నేహసౌహార్ద వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రెస్ క్లబ్ కుటుంబస్ఫూర్తిని ప్రతిబింబించింది. 24 ఏళ్ల ప్రస్థానంలో ప్రెస్ క్లబ్ సాధించిన విజయాలను స్మరించుకుంటూ, సీనియర్ జర్నలిస్టుల సేవలను గుర్తు చేసుకున్నారు. సభలో ఐజేయు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నామ పురుషోత్తం, టీజేఎఫ్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ (హెచ్-2843) అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లెల శిల్ప తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు దేవాలయం లాంటిదన్నారు. బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార మార్గాలు చూపడంలో ప్రెస్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హక్కుల సాధనకోసం యూనియన్లకతీతంగా ఇదే తరహాలో ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్‌తో పాటు గెంటెల కుమార్, ఎలుగోటి వెంకట్, కప్పల మధు, నల్ల రాకేష్, జిల్లెల్ల మల్లేష్, షేక్ సోనియా, చిన్నంశెట్టి రాంబాబు, బుర్ర శ్రీనివాస్ కళ్యాణం, ప్రగాని గోపీచంద్, షేక్ నాగుల్ మీరా, వేల్పుల జ్యోతి, శీలం కరుణాకర్ రెడ్డి, గౌరవరపు జగదీష్ శ్రీనివాస్, మొగిలి నాగేశ్వరరావు, దునక శ్రీనివాసరావు, మద్దెల చిన్ని, టి.బిక్షం, నీరుడు రాంబాబు, పాగ యోనా, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభ్యులకు భోజన విందు ఏర్పాటు చేశారు.

## బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఘోర విషాదం

**- ఇద్దరు పిల్లలను చంపి వివాహిత ఆత్మహత్య**



**బీబీనగర్ మార్చి 03 (వెలుతురు న్యూస్):** బీబీనగర్(మ) గొల్లగూడెంలో వివాహిత మహిళ మేకల ఐశ్వర్య అనే ఆమె ఇద్దరు పిల్లలను చంపి తను ఆత్మహత్య... భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు మృతికి కారణంగా తెలుస్తోంది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది పాపా వయస్సు 2 ఏండ్ల, బాబు వయస్సు పది నెలల నిన్ను తల్లిగారింటి నుంచి వచ్చింది, గత కొంతకాలంగా వేముల కొండలో ఉంటున్న ఐశ్వర్య

# మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే మాణిక్ రావు సమీక్షా సమావేశం

**- రంజాన్, వేసవి ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 3:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదలపై శాసనసభ్యులు కొన్నింటి మాణిక్ రావు మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. రాబోయే పవిత్ర రంజాన్ పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా మసీదులు మరియు ప్రార్థనా మందిరాల వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, ప్రత్యేక వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని, విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు సంబంధిత విభాగాలతో సమన్వయం చేయాలని తెలిపారు. పెండింగ్ పన్నుల (బకాయిల) వసూలు ప్రక్రియను వేగవంతం చేసి మున్సిపాలిటీ ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జైతు రామ్, కౌన్సిలర్లు తంజీమ్, గౌస్ గోరి, జాకీర్, జాహేద్ అలీ, మహిపాల్ యాదవ్, దీపక్, మాజీ కౌన్సిలర్లు నామ రవికిరణ్, అబ్దుల్లా, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి

**- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలి - ఎస్ఎఫ్ఐ**




**జహీరాబాద్ వెలుతురు మార్చి 03:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన సంఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టి. రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ నర్సింలుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టి. రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడ నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాల్సి ఉన్నప్పటికీ, గత కొన్నేళ్లుగా అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని విమర్శించారు. రాబోయే 2026-27 బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం విద్యార్థులకు నష్టం కలిగిస్తోందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులు మరోసారి ఆందోళన బాట పట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు కోటేశ్వర్ రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు అభి, హరీశ్, రిషి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కోమ్మాయిగూడెం గ్రామానికి హోలీ శుభాకాంక్షలు తెలియజేసిన మోటే రవీందర్

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 03:**



కోమ్మాయిగూడెం గ్రామం ప్రజలకు హోలీ పండుగ శు భాకాంక్షలు .ప్రతి హోలీ పండుగ ఒక కొత్త ఆశను తెస్తుంది. ఈ హోలీ మీ జీవితంలో కొత్త శక్తిని, ఆనందాలను, కొత్త విజయాన్ని తీసుకురావాలని కోరుకుంటూ హోలీ పండగ సందర్భంగా ప్రత్యేక శు భాకాంక్షలు.“ “హోలీ రంగుల్లోని ప్రతి రంగు మీ జీవితాన్ని సంతోషంతో నింపాలని కోరుకుంటూ... హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ మీ ఆత్మీయ కుటుంబ నేస్తం మోటే రవీందర్.

# కుటుంబ కలహాలు

**- ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య**

**భువనగిరి, మార్చి3( వెలుతురు):** కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్ రైడ్ సరదా

**- స్నేహితుడితో కలసి రైడ్ చేస్తుండగా ప్రమాదం**

**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):** స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు. విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్ ను అ÷-దదెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లాగూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విష్ణువర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఉషాకిరణ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# తమ్మినేనిపై వేటు

**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):** తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది.రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది.సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

# హరీష్ రావు చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ

- విద్యార్థుల భవిష్యత్తుకు బలం
- 'వైట్ కోట్ విప్లవం'కు మరింత ఊతం





**కాప్రా/ఉప్పల్, మార్చి 3 వెలుతురు:**

వైద్య విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో హరీష్ రావు నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 7 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సహాయం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే మొత్తం 122 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా ఖర్చుల నిమిత్తం సహాయం అందించడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఇది కేవలం దానధర్మం కాదని, భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే పెట్టుబడిగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన యువతకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడం ద్వారానే సమాజ సాధికారత సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విద్య ద్వారా సామాజిక మార్పు సాధ్యమవుతుందని, ఈ కార్యక్రమం ఆ దిశగా ఒక కీలక అడుగని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు స్థాపించబడటంతో "వైట్ కోట్ విప్లవం" సాకారమైందని హరీష్ రావు అన్నారు. దీని వల్ల వైద్య విద్యావకాశాలు విస్తరించడమే కాకుండా, ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు మహేష్ గౌడ్, వంజరి ప్రవీణ్, కరిపే పిల్లి నాగరాజు, బోసాని పవన్ కుమార్, దయాకర్ రెడ్డి, శ్రవణ్, రఘువరన్, నాని, రాజేష్ గౌడ్, కడిగే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

- ర్యాలీ కోసం బిఆర్ఎస్ నేతల సన్నాహాలు



**మంచిర్యాల, మార్చి3( వెలుతురు):**

క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా కేసులతో జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ , బీఆర్ఎస్ నాయకులు బుధవారం విడుదల కానున్నారు. బెయిల్ పిటిషన్ పై సోమవారం వాదనలు విన్న జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే చెన్నూర్ కోర్టులో ఉన్న మరో కేసులో పీటీ వారెంట్ ఫిటిషన్‌పై విచారణను ఆ కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. బాల్కసుమన్‌కు ఈ కేసులోనూ బెయిల్ రావాల్సి ఉండటంతో ఐదో తేదీ తర్వాతే ఆయన జైలు నుంచి బయటికి వస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నూర్ కోర్టులో పీటీ వారెంట్ ఫిటిషన్ పై విచారణ జరపాలని బాల్కసుమన్ అడ్వొకేట్లు మరో ఫిటిషన్ వేయడంతో కోర్టు విచారణను స్వీకరించింది. బాల్కసుమన్ తరుపు న్యాయవాదులు వాదనల అనంతరం పెట్టిన కేసు బెయిలెబుల్ అఫెన్స్ కావడంతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బాల్కసుమన్ సహా ఆయనతో పాటు అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు జైలు నుంచి విడుదల కానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని, రేపు ఉదయం 7 గంటలకు బాల్కసుమన్ జైలు నుంచి బయటికి వస్తారని ఆయన తరుపు న్యాయవాదులు తెలిపారు. బాల్కసుమన్ బయటికి రానున్న నేపథ్యంలో చెన్నూర్ లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన బాల్కసుమన్ సహా ఇతర బీఆర్ఎస్ నాయకులను వందలాది వాహనాల్లో ర్యాలీగా క్యాతన్‌పల్లికి తీసుకురానున్నారు. వచ్చే మార్గంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రధాన రహదారి మార్గాల్లోని పలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సుమన్ పూలమాల వేస్తారని అక్కడి నుంచి నేరుగా క్యాతన్‌పల్లిలోని తన నివాసానికి చేరుకుంటారని బీ ఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# అయ్యా సీఎం రేవంత్ రెడ్డి గారు!? హ్యాపీ హోలీ మాకెందుకీ రక్త కేళి ....!!

- ఓట్లేసిన పాపానికి రక్తం కళ్ళ చూస్తారా ..?
- ప్రాణాలు పోతే గాని రోడ్డు పూర్తి చేయరా?
- గుండ్లపల్లి - పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వీడండి.
- నడి రోడ్డు పై నిరసన తెలిపిన బిజెపి మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి.



**గన్నేరువరం వెలుతురు మార్చి 03:**

హ్యాపీ హోలీ అంటూ రంగుల పండుగ సంబరాలు చేసుకుంటుంటే, గన్నేరువరం మండలంలో డబుల్ రోడ్డు పై రక్త హోలీ జరుగుతుందని, అస్తవ్యస్తంగా , అసంపూర్తి పనులతో జాప్యం అవుతున్న గుండ్లపల్లి - పోత్తూరు రోడ్డు నిర్మాణ పనులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బిజెపి మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా ఆయన మొఖంపై రంగులు చల్లుకొని నడిరోడ్డులో కూర్చుని నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. గుండ్లపల్లి పొత్తూరు రహదారి డబల్ రోడ్డు నిర్మాణం పట్ల కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. గుండ్లపల్లి నుండి పొత్తూరు వరకు ఉన్న ఈ డబుల్ రోడ్డు కోసం దశాబ్దాలుగా ప్రజలు వేచి చూస్తున్నారని తెలిపారు. ప్రతి ఎన్నికల సమయంలో హామీలు ప్రతి ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుంటే, ఇక్కడి ప్రజలకు మాత్రం గాయాలు, ప్రమాదాలే మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం 71 కోట్ల రూపాయల జి.ఓ. తీసుకొచ్చి శంకుస్థాపన చేసి ప్రచారంతో సరిపెట్టుకుందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే "100 రోజుల్లో రోడ్డు నిర్మిస్తా" అని హామీ ఇచ్చి, ఉన్న రహదారినే చెడగొట్టి కంకర పోసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నిత్యం ఆ కంకర రాళ్లు ఎగిరిపడి చిన్నారులు, వృద్ధులు గాయపడుతున్నారని. తన మొఖంపై ఉన్న హోలీ రంగులా ప్రజల ముఖాలపై రక్తపు మచ్చలు పడుతున్నాయన్నారు.. ఓట్లేసిన పాపానికి ప్రజలు రక్తం కళ్లతో చూడాలా?" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. వర్షాకాలం వస్తే మండలం మొత్తం జలదిగ్బంధనానికి గురవుతుందని, అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. ఈ రహదారి కేవలం అసౌకర్యం కాదు ఇది ప్రాణహాని అని, ప్రతి రోజు ప్రమాదాల అంచున ప్రజలు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజల ప్రాణాలు కూడా విలువైనవేనన్నారు., ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించి గుండ్లపల్లి పొత్తూరు డబల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

- నేడు వేకువ జామున తిరిగి దర్శనాలు



**హైదరాబాద/తిరుపతి, మార్చి3( వెలుతురు):**

సంపూర్ణ చందగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చందగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చందగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసు కున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు. సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా తెలంగాణలోని పలు ప్రముఖ ఆలయాలను తాత్కాలికంగా మూసేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసేశారు. తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. నిర్మల్ జిల్లా బాసర ఆలయాన్ని కూడా మూసివేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఉదయం 6.15 నుంచి సాయంత్రం 7.15 వరకు మూసివేసారు. అనంతరం పుణ్యాహవాచనం, సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతిస్తారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలు కూడా మూసివేసారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరిచి శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం నిత్యపూజల తర్వాత దర్శనాలు ప్రారంభిస్తారు. ఓదెల మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని గ్రహణం కారణంగా మూసి వేసారు. ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల అనంతరం భక్తులకు అనుమతి ఇస్తారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7.30 వరకు మూసివేసారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తులు ఆలయ సమయాలను గమనించి దర్శనానికి రావాలని అధికారులు సూచిస్తున్నారు.

# స్వధర్మమే సంపూర్ణ రక్ష..!

- మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి
- జహీరాబాద్ చేరుకున్న రథయాత్ర
- అడుగడుగునా నీరాజనం
- ఘనంగా స్వాగతం పలికిన పట్టణ భక్తులు





**జహీరాబాద్ వెలుతురు మార్చి 03:**

భారతీయ సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు పాటించాలని, మన ధర్మమే మనకు రక్షణగా ఉంటుందని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ అన్నారు. బర్దిపూర్ ఆశ్రమ వ్యవస్థాపకులైన శ్రీ దత్తగిరి మహారాజ్ వారి 47వ వార్షిక అమరతిథి సందర్భంగా నిర్వహిస్తున్న 37వ పాదయాత్రపల్లకి సేవ రథయాత్ర ఆరవ రోజైన మంగళవారం ఉదయం 6 గంటలకు హద్నూర్ నుంచి బయలుదేరి న్యామతాబాద్, చౌరస్తా గంగ్వార్, బంగ్లా మీర్జాపూర్, కొత్తూర్, బీదర్ క్రాస్ రోడ్ గ్రామాల మీదుగా రాత్రికి జహీరాబాద్ కైలాసగిరి శివాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా పీఠాధిపతులు భక్తులకు ప్రవచనామృతాన్ని అందించారు. భారతీయ సనాతన ధర్మం గొప్పదని, మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ఇతర సంస్కృతులను అనుసరించడం సముచితం కాదని, మన ధర్మమే మనకు నిజమైన రక్షణగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి దశలోనూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు అణువణువునా నిండి ఉన్నాయని చెప్పారు. విదేశీ సంస్కృతిని అతి ఉత్సాహంతో అనుసరించడం అనేది మంచి పద్ధతి కాదని తీవ్రంగా మండిపడ్డారు. మన మూలాలను మరిచిపోకుండా సనాతన విలువలను కాపాడుకోవాలని సూచించారు. పాదయాత్ర భక్తులకు కొత్తూర్, జహీరాబాద్ లలో డాక్టర్. శరణప్ప, నర్సింహారెడ్డి, అల్లాడి నరసింహులు, రాజయ్య బెజగం, సాయిరెడ్డి విఠల్ రెడ్డి, నామరవి కిరణ్, బిర్నెల్లి విద్యాసాగర్ తదితరులు ఏర్పాట్లను చేశారు.

# అంగన్‌వాడీల సంక్షేమం లక్ష్యం: మంత్రి

**పాలకొల్లు, మార్చి3( వెలుతురు):**

అంగన్వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పర్యటించిన ఆయన.. రూ.5.80 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీల 9 డిమాండ్లను కూటమి ప్రభుత్వం ఇప్పటికే నెరవేర్చిందన్నారు. అంగన్వాడీలకు 2 సార్లు వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం రూ.1000 మాత్రమే పెంచి వారిని మోసం చేసిందని విమర్శించారు.

# కూల్చివేతలపై తీవ్రమవుతున్న విమర్శలు



**నల్గొండ, మార్చి3( వెలుతురు):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# ఇంటిపన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

**కోనసీమ, మార్చి 3( వెలుతురు):**
అలమూరు మండలంలో ఇంటి పన్నుల వసూళ్లు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, మడికిలలో ఇంటిపన్ను వసూళ్లను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్న గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సిబ్బందిని సమీక్షించారు. ఇంటిపన్ను వసూళ్లలో అశ్రద్ధ వహించకుండా ఈనెల రెండో వారం నాటికి ఆయా గ్రామాల్లో నూరుశాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్ల కోసం కార్యాచరణ ప్రకారం నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో రాజు పలువురు నివాసాల యజమానులను ప్రత్యక్షంగా కలుస్తూ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు బి.వెంకటరత్నం, పి.రాజు, పద్మావతి, గుమస్తా శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు సాయి, సతీష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కూలర్ల గోదాంలో పేలుడు

**కర్నూలు, మార్చి 3( వెలుతురు):**
కర్నూలు పట్టణంలోని బాలాజీ నగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ సిలిండర్లు పేలడంతో కూలర్ల గోదాంలో మంటలు చెలరేగాయి. భారీ సంఖ్యలో కూలర్లు తగలబడిపోతున్నాయి. ఎ÷-లాస్టిక్ సామగ్రి కావడంతో మంటలు వేగంగా విస్తరించాయి. భారీ పొగలు అలముకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. అక్కడ పని చేసే సిబ్బంది వంట కోసం తీసుకొచ్చిన 2 గ్యాస్ సిలిండర్లు పేలినట్లు తెలుస్తోంది.

# ఇంద్రకీలాద్రిపై 6నుంచి కుంభాభిషేకం

**- సిఎం చంద్రబాబుకు ఆహ్వానం**



**విజయవాడ, మార్చి 3( వెలుతురు):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ మహోత్సవానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆలయ అధికారులు ఆహ్వానం అందజేశారు. మంగళవారం దుర్గా దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్.. సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందజేశారు. అర్చకులు స్వామివార్ల చిత్రపటం, ప్రసాదం అందజేసి.. సీఎంకు ఆశీర్వచనాలు అందించారు. అలాగే విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే కుంభాభిషేక మహోత్సవానికి మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానం అందించారు అధికారులు. కుంభాభిషేకానికి రావాల్సిందిగా లోకేశ్‌కు దేవస్థానం అర్చకులు, పాలకవర్గం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. గమ శాస్త్రాల ప్రకారం 12 ఏళ్లకు ఒకసారి ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేకానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

# అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్ట్

**- జల్‌జీవన్ తదితర పనులపై చర్చ**

**- సిఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ**

**అమరావతి, మార్చి 3( వెలుతురు):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం భేటీ అయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి కేటాయించిన నిధులు, నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్స్' పనుల గురించి సీఎంకు డిప్యూటీ సీఎం వివరించారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లు నిర్మించడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని ఇరువురు చర్చించారు. నీటిపారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడిక తీత అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. వేసవిలోనే పూడిక తీత పనులు చేపట్టి.. రైతులు పంటలు వేసేలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివరించారు.

# అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం తగదు

**- వారి జీతాల సమస్యను పరిష్కరిచండి :శ్రీనివాసరావు**

**విజయవాడ, మార్చి 3( వెలుతురు):**
జీతాల పెంపుదల సహా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న వేలాది మంది అంగన్‌వాడీలపై వారు నిద్రిస్తున్న సమయంలో బలవంతంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. మహిళలను వ్యానుల్లో ఎక్కించుకుని మగ పోలీసులు రాష్ట్రం నలుమూలలా తిప్పారని పేర్కొన్నారు. కాలకత్యాలు తీర్చుకునేందుకూ అవకాశం ఇవ్వకుండా అప్రజాస్వామికంగా వ్యవహరించారని తెలిపారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం చర్చించడానికి కూడా సిద్ధపడటం లేదని విమర్శించారు. గతంలో వైసిపి అధికారంలో ఉండగా ఇలాగే అర్ధరాత్రి అరెస్టులు చేస్తే అన్యాయమన్న చంద్రబాబునాయుడు ఇప్పుడు అదే పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, వేతనాలపై అగ్రిమెంటు చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీల ఉద్యమానికి సిపిఎం తరుపున పూర్తి మద్దతు ప్రకటించారు. రాజమహేంద్రవరంలో కల్తీపాలుతో అనేకమంది చనిపోయారని, పాల సరఫరా, మంచినీటి సరఫరాపై ప్రభుత్వం ఎటువంటి నిఘా, నియంత్రణా లేదని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళంలో డయేరియా వ్యాపించిందని, చాలా పట్టణాల్లో మురికినీరు పైపుల్లో సరఫరా అవుతోందని తెలిపారు. వీటిని తనిఖీలు చేసి సురక్షిత నీటిని సరఫరా చేయాలని, డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ పేరుతో చేస్తున్న పనులన్నీ వందల కోట్లు కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకేనని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# మరణం ఒక వ్యాపారమైతే శాంతికి తావేది?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

ప్రస్తుత ప్రపంచం ఒక వింతైన వైరుధ్యంలో జీవిస్తోంది. ఒకవైపు టెక్నాలజీ శిఖరాలను తాకుతుంటే, మరోవైపు ఆదిమ కాలపు హింస ఆధునిక రూపం దాల్చుతోంది. ఉక్రెయిన్ వీధుల నుండి గాజా శిథిలాల వరకు, సూడాన్ ఎడారుల నుండి మయన్మార్ అడవుల వరకు భూమి ఎక్కడ చూసినా రక్తంతో తడిసిపోతోంది. కానీ ఈ నెత్తురు ప్రవాహం వెనుక, బాంబుల మోత వెనుక ఒక నిశ్శబ్ద శబ్దముంది అదే డాలర్ల గలగల . యుద్ధం ఒకరికి విషాదమైతే, మరొకరికి అది లాభదాయకమైన వ్యాపారం. ప్రపంచ ఆయుధ మార్కెట్ నేడు ట్రిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా అవతరించింది. కోట్లాది నిరపరాధుల కన్నీళ్లతో ఈ సంపద కోటలు నిర్మించబడుతున్నాయి .ప్రపంచ శాంతి గురించి ఉపన్యాసాలు దంచే దేశాలే ఆయుధాల తయారీలో అగ్రగాములుగా ఉండటం ఒక చేదు నిజం. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (SIPRI) ఇటీవల విడుదల చేసిన గణాంకాలు చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. 2024 నాటికి ప్రపంచ సైనిక వ్యయం మరియు ఆయుధ వ్యాపారం అక్షరాలా 2.24 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంది. మానవ చరిత్రలో ఇది ఒక రికార్డు. ఈ మరణ వ్యాపారంలో సింహభాగం అమెరికాదే. ప్రపంచ ఆయుధ ఎగుమతుల్లో 40 శాతానికి పైగా వాటాను కలిగి ఉండి, రక్షణ రంగంలో తిరుగులేని ఏకఛత్రాధిపత్యం వహిస్తోంది. దీని తరువాత రష్యా, ఫ్రాన్స్, జర్మనీ, చైనా మరియు యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలు క్యూలో ఉన్నాయి. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి కార్పొరేట్ దిగ్గజాలు కేవలం కంపెనీలు కావు, అవి దేశాల విదేశాంగ విధానాలను శాసించే శక్తులుగా మారాయి. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రతిసారీ ఈ కంపెనీల స్టాక్ మార్కెట్ గ్రాఫ్‌లు ఆకాశాన్ని తాకుతుంటాయి. అంటే, అక్కడ శవం పడితేనే ఇక్కడ లాభం పండుతుందన్నమాట. యుద్ధాలు అకస్మాత్తుగా రావు, అవి సృష్టించబడతాయి. ప్రతి క్షిపణి ప్రయోగం వెనుక ఒక ఆర్థిక లెక్క ఉంటుంది. 2003 ఇరాక్ యుద్ధాన్ని గమనిస్తే, ప్రజాస్వామ్యం పేరుతో జరిగిన ఆ విధ్వంసం వెనుక అసలు లక్ష్యం చమురు బావుల నియంత్రణ అని స్పష్టమవుతుంది. అఫ్ఘానిస్తాన్‌లో రెండు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో అమెరికన్ రక్షణ కాంట్రాక్టర్లు 100 బిలియన్ డాలర్లకు పైగా వెనకేసుకున్నారని అంచనా.
ప్రస్తుత ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని తీసుకోండి. ఉక్రెయిన్‌కు సహాయం పేరిట అమెరికా, ఐరోపా దేశాలు పంపుతున్న బిలియన్ల డాలర్ల ఆయుధాలు నిజానికి వారి స్వదేశీ కంపెనీల నుండే కొనుగోలు చేయబడుతున్నాయి. అంటే, పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఆయుధ కంపెనీల జేబుల్లోకి మళ్లించడానికి యుద్ధం ఒక నెపంగా మారుతోంది. శాంతి స్థాపన కోసం ఆయుధాలు పంపడం అనేది వినడానికి ఎంత విడ్డూరంగా ఉన్నా, ఇదే నేటి ప్రపంచ రాజకీయ గమన సూత్రం.
ఆయుధ వ్యాపారం వల్ల అత్యంత నష్టపోతున్నది పేద మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలే. ఆఫ్రికా, మధ్యప్రాచ్యం మరియు దక్షిణాసియా దేశాలు తమ ప్రజల ఆకలి తీర్చడానికి, విద్యను అందించడానికి ఉండాల్సిన నిధులను యుద్ధ ట్యాంకులు, విమానాల కోసం తగలేస్తున్నాయి. యెమెన్ అంతర్యుద్ధంలో వాడబడుతున్న అత్యాధునిక బాంబులు పశ్చిమ దేశాల ఫ్యాక్టరీల నుండి వచ్చినవే. అవి పేలుతున్నది పాఠశాలలు, ఆసుపత్రుల మీద. భారతదేశం కూడా ఈ చక్రబంధంలో చిక్కుకుంది. 2024-25 రక్షణ బడ్జెట్ 6.21 లక్షల కోట్ల రూపాయలు. ఇది మన దేశ ఆరోగ్య బడ్జెట్ కంటే సుమారు మూడు రెట్లు




ఎక్కువ. ప్రపంచంలోనే అత్యధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకునే దేశాల్లో ఒకటిగా మనం ఉండటం మన ఆర్థిక వ్యవస్థపై భారీ భారాన్ని మోపుతోంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ రష్యా, ఫ్రాన్స్ లేదా అమెరికా నుండి వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకోవాల్సిన అనివార్యతను మనకు కల్పిస్తున్నారు. వైట్ కాలర్ వ్యాపారం ఒకవైపైతే, దొంగచాటుగా సాగే అక్రమ ఆయుధ వ్యాపారం మరో భయంకరమైన కోణం. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, ఏడాదికి 40 నుండి 60 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు అక్రమ మార్గాల్లో చేతులు మారుతున్నాయి. ఇవి సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థలు, డ్రగ్ మాఫియాల చేతుల్లోకి వెళ్తున్నాయి. సిరియా, లిబియా వంటి దేశాల్లో అస్థిరతకు ఈ అక్రమ ఆయుధాలే కారణం. ఆఫ్రికాలో పదేళ్ల పిల్లవాడి చేతిలో ఏకే-47 కనిపిస్తుందంటే, దానికి మూలాలు ఎక్కడో అభివృద్ధి చెందిన దేశాల కర్మాగారాల్లోనే ఉంటాయి. నిబంధనల ప్రకారం యుద్ధ ప్రాంతాలకు ఆయుధాలు అమ్మకూడదు, కానీ లాభం ముందు నీతి ఎప్పుడూ ఓడిపోతూనే ఉంది.యుద్ధం అంటే కేవలం భూభాగాల ఆక్రమణ కాదు, అది ఒక తరం విధ్వంసం. 2024 చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 11 కోట్ల మంది శరణార్థులుగా మారారని UNHCR చెబుతోంది. గాజాలో గడిచిన ఏడాది కాలంలోనే 35,000 మందికి పైగా బలికాగా, అందులో సగం మంది పిల్లలే ఉండటం మానవత్వానికే సిగ్గుచేటు.ఆర్థికంగా చూసినా, ఒక దేశం దశాబ్దాల పాటు కష్టపడి నిర్మించుకున్న మౌలిక సదుపాయాలు క్షణాల్లో బూడిదవుతున్నాయి. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 500 బిలియన్ డాలర్లు అవసరమని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఆయుధాలు కొనడానికి చేసిన ఖర్చు కంటే, కూలిపోయిన వాటిని కట్టడానికి అయ్యే ఖర్చు పది రెట్లు ఎక్కువ. ఇది ఒక అంతులేని విషవలయం. భారతదేశం ఇప్పుడు తన వ్యూహాన్ని మారుస్తోంది. కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోకుండా, రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా 2024-25లో రక్షణ ఎగుమతులు 21,083 కోట్ల రూపాయలకు చేరాయి. గత పదేళ్లలో ఇది 30 రెట్ల పెరుగుదల. తేజస్ యుద్ధ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణులు, ధ్రువ్ హెలికాప్టర్లు నేడు విదేశీ గడ్డపై మన ముద్రను చాటుతున్నాయి. నాూా, ణ=ణూ వంటి సంస్థలు సాధిస్తున్న ఈ విజయాలు గర్వకారణమే అయినా, మరో కోణంలో చూస్తే మనం కూడా ఈ గ్లోబల్ ఆయుధ పోటీలో ఒక భాగస్వామిగా మారుతున్నామా? అనే చర్చ మేధావుల్లో నడుస్తోంది. ఏది ఏమైనా, విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గించడం ఆర్థికంగా మనకు మేలు చేసే విషయమే. ఆయుధాలు ఉన్నందువల్ల యుద్ధాలు వస్తున్నాయా? లేదా యుద్ధాలు ఉన్నందువల్ల ఆయుధాలు కొంటున్నారా? ఇది కోడి ముందా-గుడ్డు ముందా అన్నట్లు ఉంటుంది. కానీ ఆయుధ పరిశ్రమ మనుగడ సాగించాలంటే సంఘర్షణలు ఉండాలి. శాంతి నెలకొంటే వారి వ్యాపారం కుదేలవుతుంది. అందుకే ప్రపంచ దేశాల మధ్య సయోధ్య కుదరకుండా ఆయుధ లాబీయింగ్ నిరంతరం పని చేస్తూనే ఉంటుంది. నోబెల్ విజేతలు, మానవ హక్కుల కార్యకర్తలు ఒకే విషయాన్ని పదే పదే చెబుతున్నారు .ఆయుధాల మీద పెట్టే ఖర్చులో సగం విద్య, వైద్యంపై పెడితే ప్రపంచంలో పేదరికం ఉండదు స్వీడన్, నార్వే వంటి దేశాలు దౌత్యం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని నిరూపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఆర్మ్స్ ట్రేడ్ ట్రీటీ (ూు) ఉన్నప్పటికీ, బలీయమైన దేశాలు దానిని తుంగలో తొక్కుతున్నాయి. యుద్ధం మన ఇంటికి దూరంగా ఎక్కడో జరుగుతోంది కదా అని మనం నిశ్చింతగా ఉండలేము. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనుసంధానించబడి ఉంది. మన పన్ను డబ్బు బాంబుల తయారీకి వెళ్తోంది. మన నాయకుల ఒక నిర్ణయం వేల మైళ్ల దూరంలో ఉన్న ఒక పిల్లాడి భవిష్యత్తును చిదిమేస్తోంది. బుల్లెట్ల కంటే పుస్తకాలు, క్షిపణుల కంటే కిలోవాట్ల విద్యుత్ ముఖ్యం అని గుర్తించిన రోజే నిజమైన భద్రత సాధ్యమవుతుంది. యుద్ధం లాభదాయకమైనంత కాలం, శాంతి ఒక కలగానే మిగిలిపోతుంది. మరణాన్ని వ్యాపారంగా మార్చిన వ్యవస్థను ప్రశ్నించడం, శాంతి కోసం గొంతు ఎత్తడం ఈ తరం పౌరులుగా మనందరి బాధ్యత. రేపటి ప్రపంచం బాంబుల మోతతో కాకుండా, చిన్నారుల నవ్వులతో నిండాలని ఆశిద్దాం.

# ఇరాన్ అధినేతను హత్య చేసినా నోరు మెదపరా

**- ఇదెక్కడి విదేశాంగ విధానమో మోడీ చెప్పాలి**

**- ఇరాన్‌పై దాడి గురించి మోడీకి ముందే తెలుసా**

**- కూటమి నేతలు కూడా ఖండించక పోవడం దారుణం**

**- మీడియా సమావేశంలో బివి రాఘవులు, శ్రీనివాసరావు**




**విజయవాడ, మార్చి 3( వెలుతురు):**
ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి కేవలం ఇరాన్ కే పరిమితం కాకుండా ప్రపంచాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేసే స్థాయికి చేరుకుంటుందని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బివి.రాఘవులు మాట్లాడుతూ వెంటనే ఈ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నేడు అమెరికా పలు అబద్ధాలను చెప్పి ప్రపంచ ప్రజానీకాన్ని మభ్యపెట్టి యుద్ధాన్ని మారణహోమాన్ని సమర్థించుకుంటుందని, ట్రంప్ ప్రయత్నాన్ని ప్రపంచ ప్రజలంతా, శాంతి కాముకులంతా ఖండించాలని కోరారు. అన్ని సందర్భాలలో భారతదేశానికి గట్టి మిత్రుడిగా ఉన్న ఇరాన్ పై మరో దేశం దాడి చేసి ధ్వంసం చేస్తుంటే దాన్ని ఖండించాల్సిందిపోయి ఇంతవరకు భారత ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా జరుపుతున్న దాడిని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి, ప్రతిపక్ష వైసిపి ఖండించాలని బి.వి.రాఘవులు కోరారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ నాయకత్వంతో మాట్లాడి వచ్చిన తరువాతే ఇరాన్‌పై దాడి జరిగిందని, దాడి గురించి ముందే మోడీకి తెలిసి ఉండాలని అన్నారు. బలమైన నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్న కేంద్రం దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయిందో చెప్పాలన్నారు. లేక దాడి విషయం ముందే తెలిసి ఇజ్రాయిల్ ప్రధానిని కలిశారా? అదైనా బయటపెట్టాలన్నారు. ఇరాన్ అన్ని సందర్భాల్లోనూ భారత దేశానికి మంచి మిత్రుడిగా ఉందని, అయినా ఆ దేశ అధినాయకుడిని చంపేస్తే స్పందించకుండా యుఏఈలో అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశారనే అంశంపై మాత్రమే స్పందించడం అన్యాయమని తెలిపారు. ఇరాన్‌పై దాడితో ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా ఇండియా పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడిని నిలిపేయాలని అన్ని దేశాలూ డిమాండు చేయాలని అన్నారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, సఫలమవుతున్నాయని అనుకున్న సమయంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి చర్చలకు విఘాతం కలిగించాయని అన్నారు. అప్రజాస్వామికంగా స్కూళ్లపై దాడిచేసి విద్యార్థులను చంపేసిందని తెలిపారు. తమపై దాడి చేస్తారనే ఉద్దేశంతోనే తాము దాడిచేశామని ట్రంప్ చెబుతున్న మాటలు అబద్ధాలని, ఇరాన్ అటువంటి ఆలోచనలు చేయడం లేదని పెంటగాన్ నివేదిక తెలిపినా దాడి చేశారని తెలిపారు. అయితే మోడీ దెబ్బతినిపోతున్న ఇరాన్ తరుపున కాకుండా దాడి చేస్తున్న దేశం తరుపున ' మిత్రులు, శత్రువులకు తేడా తెలియకుండా వ్యవహరించారని అన్నారు. ఈ విషయంలో అమెరికా వ్యూహంలో మోడీ భాగస్వామ్యం అయ్యారని, ఇజ్రాయిల్ తరుపున స్పందించి దేశ ప్రతిష్టను దిగజార్చారని తెలిపారు. ఇరాన్‌లో శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేశామని గతంలోనే చెప్పిన అమెరికా అదే సాకుతో ఇప్పుడు దాడిచేయడం అమానుషం అన్నారు.కేంద్రం తీసుకొస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మార్చి 24వ తేదీన సిపిఎం ఆధ్వర్యాన ఢిల్లీలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని రాఘవులు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా చట్టాలు అమలు చేస్తోందని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తున్నామని అన్నారు. జీరాంజీ కొత్త చట్టాన్ని తీసుకురావడం వల్ల పేదలు ఉపాధి కోల్పోయారని, దీన్ని ఉపసంహరించాలనేది ప్రధాన డిమాండని పేర్కొన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు వెనక్కు తీసుకోవాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని, న్యూక్లియర్ లయబిలిటీ బిల్లునూ తీసుకువచ్చారని, వాటిని రద్దు చేయాలని సిపిఎం డిమాండు చేస్తోందని పేర్కొన్నారు. ఇవి కాకుండా విదేశీ విత్తన కంపెనీల కోసం సీడ్‌బిల్లును తీసుకువస్తుందని అన్నారు. మరోవైపు అమెరికా 18 శాతం ట్యాక్సు విధించిందని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు జరిపి మార్చి 24న ఢిల్లీలో కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు.

# బహ్రాయిన్‌లో చిక్కుకున్న తెలుగువారు

**వారిని రప్పించాలంటూ కేంద్రమంత్రి రామ్మోహన్‌కు వినతి**

**లేఖ రాసిన విజయనగరం ఎంపి కలిశెట్టి**

**న్యూఢిల్లీ, మార్చి 3( వెలుతురు):**
పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా బహ్రెయిన్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 65 మంది తెలుగువారిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.. పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం కేంద్రమంత్రికి లేఖ రాశారు. అక్కడ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 39 మంది, తెలంగాణకు చెందిన 26 మంది చిక్కుకుపోయారంటూ వారి పేర్లు, పాస్‌పోర్టు వివరాలు, ఫోన్ నంబర్లను కేంద్రమంత్రికి పంపిన లేఖతో జతచేశారు. బాధితుల్లో వర్కర్లు, విద్యార్థులు, పర్యటకులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. విదేశాంగ శాఖ, బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి వారిని క్షేమంగా వెనక్కి రప్పించే ప్రయత్నం చేయాలని అప్పలనాయుడు కోరారు.

# స్త్రీశక్తి పథకంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

**- సిఎం చంద్రబాబుతో ప్రకాశం ఎస్పీ**

**- రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలని అధికారులరు సిఎం సూచన**

**అమరావతి, మార్చి3( వెలుతురు):**
రోడ్డు ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. స్త్రీశక్తి పథకంతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సిఎం చంద్రబాబుతో అన్నారు. దీంతో ఈ రకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా ప్రవేశపెట్టి.. అమలు చేస్తోంది. అందులో ఒక్కటి స్త్రీ శక్తి పథకం. ఈ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పించారు. ఈ పథకంతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నాయి.ఈ మేరకు ప్రకాశం జిల్లా పోలీసుల అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షను వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గిందంటూ సీఎం చంద్రబాబు దృష్టికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తీసుకెళ్లారు.స్త్రీ శక్తి పథకం అమలుకు ఆరు నెలల ముందు, తర్వాత పోల్చుకుంటే..19 శాతం మేర మరణాలు తగ్గినట్టు ఈ జిల్లా పోలీసులు ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా అధ్యయనం చేయించాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. గతంతో పోల్చుకుంటే ప్రకాశం జిల్లాలో10 శాతం మేర మరణాలు తగ్గినట్టు నివేదికలో వెల్లడించారు.

# గల్ఫ్ దేశాల్లో ఇండియన్స్ కోసం భారత్ వ్యూహాలు



**న్యూఢిల్లీ, మార్చి3( వెలుతురు):**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావణం నెలకొంది. దీంతో గల్ఫ్ దేశాల్లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వాళ్ల చదువులకు ఆటంకం ఏర్పడటమే కాకా భద్రతాపరంగా ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 నాటి గణాంకాల ప్రకారం 150 దేశాల్లోని యూనివర్సిటీలు, స్కూళ్లలో మొత్తంగా 18.80 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీళ్లలో పశ్చిమాసియాలోనే దాదాపు 5 లక్షల మంది ఇండియన్ స్టూడెంట్స్ ఉన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. దీంతో ఇక్కడ భారతీయులకు అనుగుణంగా ఉండే సిలబస్‌నే బోధిస్తారు. అందుకే భారతీయ విద్యార్థులు ఇక్కడ చదవుకునేందుకు ప్రాధాన్యం చూపిస్తారుకేంద్ర గణాంకాల ప్రకారం చూసుకుంటే జంఇలో అత్యధికంగా 2,53,832 మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా (75,830), కువైట్(50,000), ఖతార్(49,346), ఒమన్ (44,847), బహ్రెయిన్ (28,620), ఇజ్రాయెల్(900) దేశాలు ఉన్నాయి. దాదాపు 5 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఈ దేశాల్లో చదువుకుంటున్నారు. అక్కడ మార్చి 2న 10వ తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు జరగాల్సి ఉంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాటిని కూడా వాయిదా వేశారు. మరోవైపు ఉపాధి కోసం పశ్చిమాసియాకు వచ్చిన భారతీయుల సంఖ్య దాదాపు 80 లక్షలు ఉంటుంది

# ఫీజుల నియంత్రణకు కసరత్తు..




**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):**
ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్కూళ్ల పరిస్థితి.. అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అక్కడ అందున్న విద్యాబోధన తదితర అంశాలను, ఆ పాఠశాలకు సంబంధించి గత రికార్డులను బేరీజు వేసుకొని ఫీజులను నిర్ణయించేందుకు సర్కార్ సిద్ధమైంది.తెలంగాణ వ్యాప్తంగా 11వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. మరో నెల రోజుల్లో 2025-26 విద్యా సంవత్సరం ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి పలు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. అయితే, కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.ప్రతి రెండేళ్లకోసారి 8శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూల్లో ఎంత ఫీజు ఉంది..? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు..? అనే వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనేదానిపై అధికారులు కసరత్తు చేశారు.ఆయా స్కూళ్ల నిర్వహణ ఖర్చుల ఆధారంగానే స్కూళ్ల ఫీజులు ఉండాలని విద్యాశాఖ భావిస్తోంది. దీనికోసం గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేస్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు.విద్యాశాఖపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు.మరోవైపు.. ఫీజుల నియంత్రణ పక్కాగా అమలు చేసేందుకు స్టేట్ లెవల్ ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని గానీ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీనిగాని నియమించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణను చేపట్టాలని ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేపట్టింది.

# త్రిశూల్ వ్యూహంతో అమెరికా ఇజ్రాయిల్

**న్యూఢిల్లీ, మార్చి3( వెలుతురు):**
యుద్ధం అంటే గగనతలంలో గర్జించే జెట్లు, నేలపై పేలే బాంబులు అనుకుంటాం. కానీ ఈసారి కథ అక్కడి నుంచి మొదలుకాలేదు. ఇరాన్‌పై దాడి చేయాలనుకున్న ఇజ్రాయెల్-అమెరికా అద్భుతమైన స్కెచ్ వేశాయి. బాంబర్లు, జెట్లు ఇలా దాడిచేస్తే.. ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ వారిని అడ్డుకుంటుందని తెలుసు. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేశాయి. అసలు యుద్ధం మొదలైంది ఆకాశంలో కాదు... రాడార్ స్క్రీన్‌లపైనే.. ఇజ్రాయెల్-అమెరికా చేపట్టిన సైబర్, డెకాయ్, ఎయిర్ అటాక్‌లకు ఇరాన్ బిత్తరపోయింది. ఆధునిక వార్‌ఫేర్ ఎలా మారిపోతోందో ఈ అటాక్ కళ్లకు కట్టింది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎందుకు పనిచేయలేకపోయింది? సూటిగా చెప్పాలంటే ? ప్రత్యర్థి సాంకేతిక సామర్థ్యం పూర్తిగా ఇరాన్‌కు అందనంత స్థాయిలో ఉంది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్‌ను ఛేధించడం కోసం యుఎస్ సైబర్ వార్‌ఫేర్‌ను ఉపయోగించింది. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ ఆపరేషన్లు కలిసి రాడార్‌లలోకి నకిలీ డేటాను పంపించాయి. అంటే పదుల సంఖ్యలో యుద్ధ విమానాలు ఇరాన్ వైపు దూసుకొస్తున్నట్లుగా స్క్రీన్‌పై కనిపిస్తుంది.కానీ అవన్నీ వాస్తవాలు కావు. ఇరాన్‌లోని స్వదేశీ బావర్ వ్యవస్థలైనా, రష్యా నుంచి వచ్చిన ఎస్-300, ఎస్-400 బ్యాటరీలైనా ? ఒకేసారి వచ్చిన డిజిటల్ దాడిని తట్టుకోలేకపోయాయి. రాడార్ ఆపరేటర్‌కు ఏది నిజం? ఏది మోసం? అర్థం కాని పరిస్థితి.ఇదే సమయంలో వందల సంఖ్యలో డీకాయ్ డ్రోన్లు ప్రయోగించారు. ఇవి చిన్నవే. కానీ రాడార్‌కు మాత్రం ఎఫ్-15లు, ఎఫ్-16ల పెద్ద స్క్వాడ్రన్‌లా కనిపిస్తాయి. టెహ్రాన్ వైపు భారీ దళం దూసుకొస్తున్నట్టే సిగ్నల్ వస్తుంది. ఇక ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ పూర్తిగా వాళ్ల వెంట పడుతుంది. డెకాయి డ్రోన్లను డీల్ చేయడంలో ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ బిజీగా ఉన్న సమయంలోనే ఎఫ్-35, ఎఫ్-22లు ఇరాన్ భూభాగంపైకి వెళ్లాయి. అసలేం జరుగుతుందో ఇరాన్‌కు అర్థమయ్యే లోపు వారి రక్షణ ముఖద్వారం బద్దలైపోయింది. మొదటి దశ: టెహ్రాన్, ఇలామ్, ఖుజెస్టాన్



ప్రాంతాల్లోని సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సైట్లు, రాడార్ స్టేషన్లు, గాలి రక్షణ హెడ్‌క్వార్టర్స్‌ను టార్గెట్ చేశారు. రెండో దశ: బ్యాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, నిల్వ కేంద్రాలపై దాడులు. మూడో దశ: సైనిక తయారీ పరిశ్రమలపై దృష్టి. దీర్ఘకాల యుద్ధ సామర్థ్యాన్ని బలహీనపరచడం లక్ష్యం. ఇక అసలైన భౌతిక దాడి సముద్రంపై నుంచి మొదలైంది. ఇరాన్‌కు దగ్గరలో ఉన్న అమెరికన్ మిస్సైల్స్ పైకి లేచాయి. ఇవి శత్రు రాడార్‌లకు దొరక్కుండా చాలా తక్కువ ఎత్తులో దూసుకెళ్లాయి.అంతకుముందే ఎఫ్-35, ఎఫ్-22 రాప్టర్లు వెళ్లడంతో అప్పటికే రాడార్‌లపై తప్పుడు లక్ష్యాలు, ఎలక్ట్రానిక్ జ్యామింగ్ ? ఈ కలయికతో ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ విచ్ఛిన్నం అయింది. ఆ సమయంలో చాలా తక్కువ ఎత్తులో వచ్చి టామ్‌హాక్స్ ఎస్-300,ఎస్-400 రాడార్ సైట్లు, కమాండ్ బంకర్లపై దాడి చేశాయి. సో.. శత్రుదేశాల ఎటాక్స్‌ను డేగకళ్లతో పర్యవేక్షించే డిఫెన్స్ సిస్టమ్‌కు కళ్లే లేకుండా పోయాయి. ఇరాన్ గగనతలంపైకి తమ ఫైటర్‌జెట్లు దూసుకువెళ్లేలా సేఫ్ కారిడార్‌ను విజయవంతంగా సృష్టించిన తర్వాత అసలు కథ మొదలైంది. ఎయిర్‌డిఫెన్స్, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేశాక.. ఇక మిగిలిన లక్ష్యాలను ఛేధించడానికి బాంబర్స్ వచ్చేశాయి. అవి ఒకేసారి జెడామ్ బాంబులు, మిస్సైళ్లను తీసుకెళ్లగలవు. ఇందుకోసం ః-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లను తెచ్చారు. ఇవి భూమి మీదనే కాదు.. భూమిలోపల ఉండే బంకర్లను కూడా ధ్వంసం చేయగలుగుతాయి. అదే సమయంలో జోర్డాన్, యూఏఈ లోని అమెరికన్ బేస్‌ల నుంచి.. ఎఫ్-15ఇ స్ట్రయిక్ ఈగల్స్ దూసుకొచ్చాయి. ఒక్కో జెట్ 19 జెడామ్ లు లేదా 28 చిన్న డయామిటర్ బాంబులు మోసుకెళ్లగలదు. ఇవి ప్రధానంగా మూవింగ్ టార్గెట్స్ ను చేధిస్తాయి. అంటే వాహనాలపై నుంచి ప్రయోగించే సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ సిస్టమ్‌ను గుర్తించి దానని ధ్వంసం చేస్తుందన్నమాట.. లోయల్లో దాగి ఉన్న మొబైల్ మిస్సైల్ లాంచర్లు, కమాండ్ సెంటర్లపై దాడులు జరిపాయి.ఎంతగా ప్లాన్ చేశారు అంటే ఒకసారి దాడి చేసిన తర్వాత ఇవి తిరిగి వెళ్లవు. మళ్లీ దాడి చేయడానికి వీలుగా వీటికి ఆకాశంలోనే ఇంధనాన్ని నింపే కూడా చేశారు. అందుకే ఇంధనాన్ని నింపుకుని వచ్చి మళ్లీ మళ్లీ దాడులు చేశాయి. ఇజ్రాయెల్, యుఎస్ అంత కచ్చితమైన స్కెచ్ వేశాయి. ఓ పక్క వైమానిక దళం డిస్ట్రక్షన్ చేసేస్తుంటే.. దానికి సపోర్ట్‌గా యూ ఎస్ నేవీ రంగంలోకి వచ్చింది. రెండు గంటల తర్వాత జూ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లు అరేబియా సముద్రం నుంచి ఆపరేషన్ మొదలుపెట్టింది. దూరంగా ఉన్న అమెరికాను ఏం చేయలేక యుఎస్ మిత్రదేశాలపై దాడులు మొదలు పెట్టింది. యూఏఈలోని ఎయిర్ బేస్ పై దాడి చేశారు. బహ్రెయిన్ లోని యూఎస్ నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయాన్ని కూడా టార్గెట్ చేశారు. సోమవారం సాయంత్రానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయంపై కూడా దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది.డికాయ్ ఆపరేషన్స్, సైబర్ ఎటాక్, వంటివి ఫ్యూచర్ వార్‌ఫేర్‌లో ఏ రీతిలో ప్రాధాన్యం వహిస్తున్నాయో ఈ ఆపరేషన్ చెబుతోంది.

# గుడిసెల కూల్చివేత చుట్టూ రాజకీయ దుమారం

**ఖమ్మం, మార్చి3( వెలుతురు):**
ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చివేత పొలిటికల్ హైడ్రామాకు దారితీసింది. భూదాన్ భూములు రెవెన్యూశాఖ పరిధిలో ఉంటాయి. అందులో కూల్చివేతలు చేపడితే..సంబంధిత శాఖ మంత్రికి సమాచారం ఉంటుంది. పైగా రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లాకే చెందిన మినిస్టర్. దీంతో పలువురు ప్రజా సంఘాల నేతలు భూదాన్ భూముల్లో కూల్చివేతలపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారట.అయితే కూల్చివేతల విషయం తనకు తెలియదని..ఖమ్మం కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారట మంత్రి పొంగులేటి. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి, పైగా జిల్లా మినిస్టర్ పొంగులేటికి తెలియకుండా కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంటుందా అన్న చర్చ జరుగుతోంది. అలా అయితే పొంగులేటిని కాదని కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? అధికారులే సొంత నిర్ణయం తీసుకుని డిమాలిషన్ చేశారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెలుగుమట్ల ప్రాంతంలో గజం లక్షల రూపాయలు, ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుందట. ఆ ప్రాంతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు భూములు ఉన్నాయని..లేదు మంత్రి పొంగులేటి సంబంధికులకే అక్కడ ల్యాండ్స్ ఉన్నాయని మరొకరు ఆరోపణలు చేసుకుంటుడం చర్చకు దారితీస్తోంది.తమ ల్యాండ్ పక్కనే భూదాన్ భూముల్లో పేదలు గుడిసెలు ఉంటే..తమ భూముల ధర పడిపోతుందనే సాకుతో ఆ భూముల్లో ఉంటున్న పేదల ఇళ్లను తొలిగించారనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి. అయితే పేదల ఇళ్లు తొలగింపుకు మంత్రికి ఎటువంటి సంబంధం




లేదని తుమ్మల అనుచరులు కొట్టిపారేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై రాజకీయ జోక్యం ఎలా ఉంటుందని ఎదరు ప్రశ్నలు వేస్తున్నారట. కూల్చివేతలపై తనకు సమాచారమే లేదని పొంగులేటి చెబుతున్నారు.ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో అందరికి కీలకమైన మంత్రి పదవులే ఉన్నాయి. అయితే పాలేరు ఎమ్మెల్యే, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవన్యూ శాఖ మంత్రికి తెలియకుండా భూదాన్ భూముల్లో కూల్చివేతలు సాధ్యమేనా.? అన్న డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కూల్చివేతపై సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. కలెక్టర్ అనుదీప్‌కు ఫోన్ చేసి పేదల ఇళ్ల కూల్చివేతపై సీరియస్ అయ్యారు పొంగులేటి. తన శాఖకు సంబంధించి తనకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారు..ఇదేం పద్దతి అంటూ మండిపడ్డారు. ఇళ్లు కూల్చివేసిన భూదాన్ భూములు ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని..ఖమ్మం నియోజకవర్గం మంత్రి తుమ్మలది కాబట్టి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారట మంత్రి పొంగులేటి. ఇళ్లు కూల్చివేసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం తమకు ఎటువంటి సంబంధం లేదు..కోర్టు తీర్పును అధికారులు అమలు చేశారని చెప్పుకొస్తోంది.మంత్రి పొంగులేటి తనకేం సంబంధం లేదంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇటు తుమ్మలకు సంబంధం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అలాంటప్పుడు భూదాన్ భూముల్లో కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి తెలియకుండానే డిమాలిషన్ చేపట్టారా.?తుమ్మల ప్రమేయం ఉందా? లేక ఆయన నియోజకవర్గ పరిధిలో కూల్చివేతలు జరిగాయి కాబట్టి అలిగేషన్స్ వస్తున్నాయా? అధికారులే కోర్టు ఆర్డర్స్ ప్రకారం ముందుకెళ్లారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైతే కూల్చివేతల వెనుక ఎవరున్నరన్నది క్లారిటీ లేదు. కాకపోతే ఖమ్మం జిల్లా మంత్రుల మధ్య మాత్రం కూల్చివేతలు కొత్త చిచ్చు పెట్టినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. భూదాన్ భూముల్లో పేదల కూల్చివేత ఇష్యూ ఎటుదారితీస్తుందో చూడాలి మరి.

# కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపాను

**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):**
ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా



ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు.తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

# అమరావతిలో హైకోర్టు జస్టిస్ బంగ్లాలు

**విజయవాడ, మార్చి3( వెలుతురు):**
అమరావతి రాజధాని ప్రాంతంలోని గవర్నమెంట్ కాంప్లెక్స్ లోని సూపర్ బ్లాక్ కె ఎఫ్ ప్రాంతంలో ఈ జస్టిస్ బంగ్లాను నిర్మించారు. ప్రతి బంగ్లా దాదాపు 2019 గజాల విస్తీర్ణలో మొత్తం 775 చదరపు అడుగుల నిర్మాణంతో విస్తృతంగా రూపొందించారు. అన్ని బంగ్లాలు ఒకే వరుసలో చక్కని ప్రణాళికతో నిర్మించారు. అయితే ఇటీవలే భారత ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. న్యాయమూర్తుల హోదాకు తగినట్టుగా ఈ నివాసాల్లో అన్ని అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రతి బంగ్లాను గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ గా నిర్మించారు. విశాలమైన హాల్, బెడ్ రూమ్స్ నూతన టెక్నాలజీ వసతులతో ఈ బిల్డింగులు సిద్ధమయ్యాయి.జస్టిస్ బంగ్లా మధ్యలో సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణలో ఒక పెద్ద సెంట్రల్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు స్థలం, పెద్దల కోసం జిమ్ ఏరియా నరకమార్గాలు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ పచ్చదనంతో ప్రశాంత వాతావరణ ఉండేలా ఈ పార్కును ప్లాన్ చేశారు. జస్టిస్ అవసరాల కోసం ప్రత్యేకంగా క్లబ్ హౌస్, గెస్ట్ హౌస్ నిర్మాణానికి కూడా పునాది వేశారు. ఇది సుమారు 6300 గజాల స్థలంలో 50వేల చదరపు అడుగుల విస్తీర్ణతో మూడు అంతస్తులో నిర్మిస్తున్నారు.ఇక పిచ్చుకల పాలెం ప్రాంతంలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతుంది. సుమారు 4.83 ఎకరాల విస్తీర్ణలు ఈ అకాడమీ నిర్మిస్తున్నారు. ఇక్కడ 500 మంది కూర్చోనే ఆడిటోరియం, క్లాస్ రూమ్స్, సెమినార్ హాళ్లు, మూడ్ కోర్టు హాల్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎనిమిది అంతస్తుల హాస్టల్ భవనం కూడా నిర్మిస్తున్నారు. జస్టిస్ సిటీ ప్రాంతం.. ఔ1,ఔ2, ఇ5, ఇ6 రోడ్ల మధ్యలో ఉంది. సీడ్ ఆక్సిస్ రోడ్ నుంచి ఈ ప్రాంతానికి చేరుకునేలా 2.5 కిలోమీటర్ల కొత్త తారు రోడ్లు వేశారు. లోపల 12 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా చూస్తే ఒకప్పుడు గ్రాఫిక్స్ అని విమర్శించిన అమరావతి ఇప్పుడు నిజమైన కట్టడాలతో తన ఉనికిని చాటుకుంటుంది. జస్టిస్ సిటీలో జస్టిస్ బంగ్లాల ప్రారంభం రాజధాని అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా మారింది.

# బస్సులో అకస్మాత్తుగా మంటలు

**- పూర్తిగా కాలిపోయిన బస్సు..తప్పిన ముప్పు**

**విశాఖపట్టణం, మార్చి3( వెలుతురు):**
విశాఖ నగరంలోని రుషికొండ బీచ్ రోడ్డులో మంగళవారం ఉదయం భారీ ప్రమాదం తప్పింది. ఓ ప్రైవేటు బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలు అంటుకోగానే డ్రైవర్ చాకచక్యంగా బస్సులో నుంచి దూకి తప్పించుకున్నాడు. నగరంలోని గవర్నర్ బంగ్లా ప్రాంతం నుంచి భీమిలిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లేందుకు ఉదయం 6 గంటల సమయంలో బస్సు బయలుదేరింది. రుషికొండ సమీపంలోకి రాగానే ఇంజిన్ భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ రాజేష్, వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగిపోయారు. చూస్తుండగానే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనపై పీఎం పాలెం పోలీసులు విచారణ చేపట్టారు.

# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగు


**- విశాఖకు తిరిగి ఐబిఎం రాక: డోలా**



**అమరావతి, మార్చి3( వెలుతురు):**
వైకాపా హయాంలో రాష్ట్రం నుంచి తరిమేసిన కంపెనీలన్నీ నేడు సీఎం చంద్రబాబుపై నమ్మకంతో మళ్లీ తిరిగొస్తున్నాయని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ ఐబీఎం.. విశాఖలో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు రావడం శుభపరిణామమని చెప్పారు. రానున్న మూడేళ్లలో ఆ సంస్థ రూ.322 కోట్ల విలువైన ఐటీ ఉత్పత్తులను ఎగుమతి చేయనుందని మంత్రి అన్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. నాడు కమీషన్ల కక్కుర్తితో జగన్ అండ్ కో రాష్ట్రంలోని పరిశ్రమలను తరిమేసి యువతను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని చెప్పారు.

# పశ్చిమాసియా ఘర్షణలు

**- ముగ్గురు భారత నావికుల మృతి**



**న్యూఢిల్లీ, మార్చి3( వెలుతురు):**
పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు భారతదేశానికి చెందిన ముగ్గురు నావికులు మృతి చెందినట్లు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించింది. ఒమన్ తీర ప్రాంతాల్లో ఉన్న పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. షిప్ ఆపరేటర్ల భద్రతను కచ్చితంగా దృష్టిలోఉంచుకోవాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే రిపోర్టు చేయాలని సూచించింది. తాజా నివేదికల ప్రకారం.. భారత జెండా ఉన్న నౌకలను బంధించినట్లు ఎటువంటి సమాచారం రాలేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు పెరుగుతున్నందున పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకొన్న భారతీయ నావికులకు తక్షణ సాయం అందించడానికి.. వారిని భారత్‌కు తరలించడానికి ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యుద్ధం వల్ల ప్రభావితులైన భారత నావికులతో ఈ బృందంలోని అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతారన్నారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ కంపెనీలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, సంబంధిత పోర్ట్ అధికారులతోనూ ఈ బృందం సమన్వయం చేసుకుంటుందన్నారు.

# అవయవదానంలో రాష్ట్రానికి ఆరోస్థానం

**- కేంద్ర గణాంకాలు వెల్లడి - మంత్రి సత్యకుమార్**



**అమరావతి, మార్చి3( వెలుతురు):**
అవయవదానంలో రాష్ట్రానికి ఆరో స్థానం లభించిందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా అవయవదానాల్లో ఏపీ ఆరో స్థానంలో నిలిచిందన్నారు. మంగళవారం జీవన్‌దాన్ కార్యకలాపాలపై మంత్రి సత్యకుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలల్లో రాష్ట్రంలో 64 మందికి కొత్త జీవితం లభించిందని అన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది అవయవదానంపై స్పందన గణనీయంగా పెరిగిందన్నారు. యువత, మధ్య వయస్సు వారిలో అవయవదానం పట్ల అవగాహన పెరుగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. అవయవాల కోసం వేచి ఉన్న 5000 మందిలో 50 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారని మంత్రి వెల్లడించారు. గత ఏడాది 301 అవయవమార్పుడులు జరిగాయన్నారు. 93 మంది బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవాలు సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్యను మరింత పెరగాలని సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు.

# అప్పుడు 12... ఇప్పుడు 50

**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):**
హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ తీర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇక్కడ ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కిస్మత్‌పురా, దర్గా డివిజన్ల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో స్థానికంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి పరిధిలోని పలు కీలక నిర్మాణాలను అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ వంటి ప్రముఖ అపార్ట్‌మెంట్లు కూడా 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో వాటి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఈ ప్రాంతంలో బఫర్ జోన్ నిబంధనలు వేరుగా ఉన్నప్పటికీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో అనుమతులు పొంది నిర్మించిన భవనాలు కూడా ఇప్పుడు ప్రభుత్వ సేకరణ పరిధిలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 2004 సంవత్సరంలో మూసీ బఫర్ జోన్ కేవలం 12 మీటర్లుగా మాత్రమే ఉండేది. అయితే నది పరిరక్షణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2012లో ఈ పరిమితిని 50 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధు పార్క్ రిడ్జ్ వంటి భారీ నివాస సముదాయాలు ఇప్పుడు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చాయి. అప్పట్లో నిబంధనల ప్రకారమే అనుమతులు పొందినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్మాణాలను సేకరించడం అనివార్యమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వం ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తుందని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం అపార్ట్‌మెంట్ వాసులకు పరిహారం చెల్లించి, ఆ తర్వాతే ఆయా నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కేవలం బలవంతంగా ఖాళీ చేయించడం కాకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తరపున అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం మొత్తం 83 ఎకరాల 13 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భారీ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు భూములు, నివాస ప్రాంతాలను గుర్తించి, వాటి యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేవలం అపార్ట్‌మెంట్లు మాత్రమే కాకుండా, నది పరివాహక ప్రాంతంలోని అన్ని రకాల ఆక్రమణలు, బఫర్ జోన్ ఉల్లంఘనలపై అధికారులు నిశితంగా దృష్టి సారించారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం దశల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. ఉన్నఫళంగా ఇళ్లను ఖాళీ చేయించబోమని, ప్రతి అడుగులోనూ బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి 60 రోజుల పాటు స్థానికుల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరిస్తారు. ఈ సమయంలో వచ్చే ప్రతిపాదనలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని ఆర్డీవో వెంకట్ రెడ్డి విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం మూసీ నదికి పాత వైభవాన్ని తీసుకురావడమే కాకుండా, నగరవాసులకు ఒక చక్కని పర్యాటక ప్రాంతాన్ని అందుబాటులోకి తీసుకురావడం. గాంధీ సరోవర్ పేరుతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇన్నాళ్లూ అక్కడ నివాసం ఉంటున్న సామాన్యులకు పరిహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# హైదరాబాద్ నగరంలో పాడ్ ట్యాక్సీలు

**హైదరాబాద్, మార్చి3( వెలుతురు):**
హైదరాబాద్ నగరవాసులకు తీపి కబురు. నగరంలో మరో హైటెక్ రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, ఆటోలు, ర్యాపిడో వంటి బైక్‌ల ద్వారా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. త్వరలోనే విదేశాల్లో మాదిరిగా పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో స్టేషన్లను కనెక్ట్ చేస్తూ ఈ ట్యాక్సీలు నడపనున్నారు. హైదరాబాద్ నగరవాసులకు గుడ్‌న్యూస్. త్వరలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో ట్రైన్లను కనెక్ట్ చేస్తూ.. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) పేరిట ప్రభుత్వం ఈ ట్యాక్సీలు తీసుకురానుంది. మెట్రోరైలు స్టేషన్ల నుంచి ప్రయాణికులు తొందరగా తమ గమ్యస్థానం చేరేందుకు ఈ పాడ్ ట్యాక్సీలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనే చేపట్టాలనేది ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక చేయనున్నారు. అందు కోసం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం నగరంలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. నగరం ఓ




మూల నుంచి మరో మూలకు త్వరగా చేరుకునేందుకు మెట్రో బెస్ట్ ఆప్షన్ అయింది. అయితే మెట్రో దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఇవి అన్ని చోట్ల అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. దానికి తోడు ట్రాఫిక్‌లో నరకం. ఈ ఇబ్బందులను తొలగించేందుకు.. మెట్రో స్టేషన్ల నుంచి రోడ్ల మీదకు రావాల్సిన అవసరం లేకుండా నేరుగా పాడ్‌ట్యాక్సీల ద్వారా గమ్యస్థానాలను చేరుకునేలా వినూత్న రవాణా వ్యవస్థ ప్రవేశపెట్టేందుకు సర్కార్ రెడీ అయింది. ముందుగా.. రాయదుర్గం–కూకట్‌పల్లి, రాయదుర్గం– హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెట్రో స్టేషన్లు, నాలెడ్జి సిటీ, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాడ్ ట్యాక్సీలు పూర్తిగా ఆటోమేటెడ్, డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఈ ట్యాక్సీలు..గంటకు గరిష్ఠంగా 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రతి పాడ్ ట్యాక్సీలో 6 నుంచి 8 మంది ప్రయాణించవచ్చు. గంటకు 10వేల మందిని చేరవేసే సామర్థ్యం ఉంటుంది. బ్యాటరీ లేదా విద్యుత్తు వినియోగంతో ఎలాంటి కాలుష్యం సమస్య తలెత్తదు. మెట్రో స్టేషన్‌లో దిగడానికి కంటే ముందు పాడ్‌ట్యాక్సీని బుక్ చేసుకోవడం ద్వారా సమయా ఆదా అవుతుంది. ఇలాంటి రవాణా వ్యవస్థ ప్రస్తుతం ముంబైలో పట్టాలెక్కుతుండగా.. త్వరలోనే హైదరాబాద్ నగరంలోనూ అందుబాటులోకి రానుంది.

# కొత్త వాహనాలపై రోడ్ సెస్

**వరంగల్, మార్చి3( వెలుతురు):**
తెలంగాణలో కొత్తగా వాహనాల కొనుగోలు చేసేవారిపై అదనపు భారం పడనుంది. ప్రభుత్వం కొత్తగా 'రోడ్ సేఫ్టీ సెస్' పేరుతో అదనపు పన్నును విధిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పన్ను మె?త్తం వాహన రకాలను బట్టి రూ.2 వేల నుంచి రూ. 10 వేలు వసూలు చేయనున్నారు.కొత్తగా వాహనాలు కొంటున్నారా..? అయితే మీ జేబుకు చిల్లు పడినట్లే. ఎందుకంటే రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్త అదనపు బాదుడుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త వాహనాల కొనుగోలుపై రోడ్ సేఫ్టీ సెస్ వసూలు చేయనున్నారు. ఈ మేరకు సెస్ చెల్లించే నిబంధన మార్చి 1 నుంచి అమల్లోకి రానుంది. మోటారు వెహికల్ యాక్ట్ చట్టంలో పన్నుల విధింపుపై రాష్ట్రానికి ఉన్న అధికారాల్ని వినియోగిస్తూ తెలంగాణ రవాణాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం.. నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా రోడ్డు భద్రత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు,




కార్లతోపాటుగా ఇతర వ్యక్తిగత వాహనాలు, గూడ్స్ వెహికల్స్, ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలు ఈ విభాగం పరిధిలోకి వస్తాయి.కొత్త వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో ఈ అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మూడు చక్రాల గూడ్స్ వాహనాలపై గతంలో క్వార్టర్లీ ట్యాక్స్ ఉండేది. రవాణాశాఖ తాజాగా దాన్ని లైఫ్‌ట్యాక్స్ పరిధిలోకి తీసుకు వచ్చింది. రోడ్డు భద్రత చర్యలకు అవసరమయ్యే నిధుల సమీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ అదనపు ట్యాక్స్ ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ ప్రయోజనాలకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రైలర్లకు మాత్రం పన్ను మినహాయింపు ఉంటుంది.ఈ ట్యాక్స్ పరిధిలోకి బైకులు, కార్లు, తేలికపాటి వాహనాలు వస్తాయి. ఇతర వాహనాల పరిధిలోకి 4 నుంచి 7 సీట్ల సామర్థ్యం ఉన్న ప్రయాణికుల ఆటోలు వస్తాయి. రోడ్డు భద్రత పన్ను బైకులు, స్కూటీలు వంటి ద్విచక్రవాహనాలకు రూ. 2 వేలు ఉంటుంది. కార్లు వంటి వాటికి రూ.5 వేలు వసూలు చేయనున్నారు. ఇతర వాహనాలు అంటే గూడ్స్ వెహికల్స్, ఆటోల్లో రూ.10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడికి.. కొత్త వాహనం కొనేటప్పుడు ఈ అదనపు పన్ను ఖచ్చితంగా భారమే అవుతుంది. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని వాహనదారులు కోరుతున్నారు. అయితే సర్కార్ మాత్రం పన్ను విధింపుపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంటోంది.

# భార్య ఆరోగ్యం కోసం.. బిచ్చగాడు సినిమా తరహాలో...

**కరీంనగర్, మార్చి3( వెలుతురు):**
బిచ్చగాడు సినిమాలో హీరో విజయ్ ఆంటోని తల్లి అనారోగ్యం తగ్గాలంటూ 48 రోజులు బిచ్చగాడి దీక్ష తీసుకుంటాడు.ఇది సినిమా కథ.. ఇది కూడా ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందినదే. అయితే ఇలాంటి దీక్షలు చేస్తే ఉద్దేశం నెరవేరుతుందా? నిజంగా అనుకున్నది జరుగుతుందా? కర్మ సిద్ధాంతం ప్రకారం..మునుపటి కర్మల నుంచి విముక్తి పొందేందుకు ఇలాంటి దీక్షలు చేపడితే పాప కర్మలు తగ్గిస్తాయని నమ్మకం. భగవద్గీత అధ్యాయం 18, శ్లోకం 5 ప్రకారం యజ్ఞం, దానం, తపస్సు వంటివి పాపాలను నాశనం చేస్తాయని ఉంది. ఆలయాలను శుభ్రం చేయడం నిష్కామ కర్మ ఇది మనసుని శుద్ధి చేస్తుంది. ఇలాంటి దీక్షలు భక్తిని పెంచి మనసుని శాంతపరుస్తాయి. ఆయుర్వేదం, యోగ శాస్త్రాల్లో కూడా మనసు–అశరీరం సంబంధం గురించి ఉంటుంది. బిచ్చగాడిలా దీక్ష అంటే సన్యాస దీక్షలు సమానం...ఇది అహంకారాన్ని తగ్గించి దైవిక శక్తిని ఆకర్షిస్తుంది. తద్వారా అనుకున్నది నెరవేరుతుందని ఆధ్యాత్మివేత్తల మాట. ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఓ అడ్వకేట్ తన భార్య ఆరోగ్యం కోసం బిచ్చగాడిగా మారారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఆయన పేరు కాసర్ల జలంధర్ రెడ్డి ,అడ్వకేట్ ..సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాస్ నగర్ కు చెందిన ఆమె పేరు శిరీష, బీకాం కంప్యూటర్స్..ఆయన కరీంనగర్లో ప్రాక్టీస్ చేస్తే, ఆమె ప్రైవేట్ ఉద్యోగం చేసేది. 2006లో పెళ్లి జరిగింది, పిల్లలు లేరు.



అనారోగ్యం పాలైన ఆమె వైద్యం కోసం ఎంతో ఖర్చు చేశారు, ఎన్నో హాస్పిటల్స్ తిరిగారు..అయితే వేములవాడ రాజన్న సన్నిధిలో భిచ్చమెత్తుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుందని చెప్పడంతో మూడు నెలలుగా భిక్షాటన చేస్తున్నారు ఆ దంపతులు. పెళ్లితో ముడిపడిన బంధాన్ని వీడలేక, భార్య ఆరోగ్యంగా ఉంటే చాలు అని భావించి, ఆ భగవంతుడిపైనే భారం వేసి దైవసన్నిధిలో బిచ్చమెత్తుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశాల మేరకు వేములవాడలో బిచ్చగాళ్లకు కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహించారు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఏఎస్పీ చంద్రయ్య. ఈ సమయంలో అనర్గళంగా ఇంగ్లీష్ లో మాట్లాడుతున్న ఆ జంటను చూసి వివరాలు అడిగితెలుసుకున్నారు అధికారులు. తనకు పెద్దగా ఆస్తులు లేవని, అద్దె ఇంట్లో ఉంటూ అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేసేవాడిని అని, తన భార్య ఆరోగ్యం కుదటపడాలని ఆస్పత్రుల చుట్టూ తిరిగి విసిగిపోయాను..అందుకే దేవుడే దిక్కని భావించి ఇలా భిక్షాటన చేస్తున్నాం అని చెప్పారు జలంధర్ రెడ్డి. తనకు పోలియో ఉన్నా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు జలంధర్ రెడ్డి భార్య శిరీష. ప్రభుత్వం పెన్షన్ ఇస్తే కొంతైనా సాయం చేసినట్టు అవుతుందని చెబుతోంది ఆమె.కారణాలు ఏమైనా కానీ.. జలంధర్ రెడ్డి, శిరీష తీసుకున్న నిర్ణయంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తిరుమల లాంటి క్షేత్రంలో భగవంతుడి సేవ చేస్తే ఆరోగ్యం, మనశ్శాంతి లభిస్తుందని చాలామంది నమ్మకం. దీక్షలు తీసుకుంటే అనారోగ్య సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని మరికొందరి నమ్మకం. అయితే ఎలాంటి వైద్య సేవలు తీసుకోకుండా ఇదొక్కటే నయం చేస్తుందని కూడా స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే ఆధ్యాత్మిక దీక్షలు మనసుని బలపరుస్తాయి కానీ వైద్య చికిత్సను భర్తీ చేయలేవు. ఎందుకంటే శ్రీరామకృష్ణుడు..తన గొంతు క్యాన్సర్ ను దైవిక లీలగా భావించారు కానీ ఆధ్యాత్మికత రోగాన్ని నయం చేయలేదు.. అది మరణానికి దారితీసింది. ఫలితం కేవలం భక్తి, ఉద్దేశం, కర్మలపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు ఆధ్యాత్మికవేత్తలు.

# అల్లు వారింట పెళ్లి బాజాలు

## ఘనంగా శిరీష్ ప్రీవెడ్డింగ్ రిసిప్షన్

అల్లూ వారింట పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. తన ప్రేయసి నయనికా రెడ్డితో ఈ నెల 6న శిరీష్ వివాహం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా అల్లూ కుటుంబం హైదరాబాద్‌లోని అల్లూ స్టూడియోస్‌లో భారీ స్థాయిలో ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇండస్ట్రీ నుంచి నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున, రామ్ చరణ్, మోహన్ బాబు, నాని, నాగచైతన్య, గోపీచంద్, బ్రహ్మానందం, రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. దర్శకుల్లో కె. రాఘవేంద్రరావు, అట్లీ, వి.వి. వినాయక్ పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత అశ్వనీ దత్ కూడా ఈ వేడుకలో కనిపించారు. రాజకీయ వర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, ఏపీ ఉప సభాపతి రఘురాకృష్ణరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమంలో మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. టొవినో థామస్ హీరోగా తెరకెక్కించిన సూపర్ హీరో చిత్రం మిన్నల్ మురళితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాసిల్ జోసెఫ్ ఈ వేడుకలో కనిపించడంతో ఇండస్ట్రీ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఇటీవల అల్లు అర్జున్ హీరోగా బాసిల్ జోసెఫ్ ఓ సూపర్ హీరో కథను తెరకెక్కించబోతున్నారన్న వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. 'శక్తిమాన్' పేరుతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సిద్ధమవుతోందని ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తల్లో నిజం లేదని బాసిల్ గతంలో స్పష్టం చేశారు. అయినప్పటికీ శిరీష్ ప్రీ-వెడ్డింగ్ వేడుకలో బన్నీ స్వయంగా బాసిల్‌ను అందరికీ పరిచయం చేయడం మళ్లీ ఆ ప్రాజెక్ట్‌పై ఊహాగానాలకు తెరలేపింది. ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, బన్నీ?బాసిల్ జోసెఫ్ కాంబినేషన్‌లో ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందన్న వార్తలు వినిపిస్తు న్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ రెండు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఒకటి అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ హీరో పాన్ వరల్డ్ చిత్రం కాగా, మరొకటి లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంట్టంల్గ÷నర్. ముఖ్యంగా అట్లీతో చేస్తున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతోంది.



# నేడు విరోష్ దంపతుల రిసిప్షన్

## ఆహ్వానం ఉన్నవారికే ఎంట్రీ

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (వీరోష్) పెళ్లి వేడుకలు ఘనంగా ముగుస్తున్నాయి. ఉదయ్‌పూర్‌లో ఫిబ్రవరి 26న వీరి వివాహం అత్యంత ప్రైవేట్‌గా జరిగిన విషయం తెలిసిందే. మార్చి 2న సొంతూళ్లో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం సాగింది. ఇక మార్చి 4 బుధవారం హైదరాబాద్‌లో వీరి గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్ జరగనుంది. ఈ వేడుకకు సంబంధించి 'టీమ్ విరోష్' తాజాగా కీలక ప్రకటన విడుదల చేసినట్లు తెలుస్తుంది. ఈ రిసెప్షన్‌కు ఆహ్వానించిన అతిథులకు మాత్రమే అనుమతి ఉండబోతున్నట్లు సమాచారం. ప్రతి అతిథికి ఒక ప్రత్యేకమైన ఒకసారి మాత్రమే ఉపయోగించగల క్యూఆర్ కోడ్‌ను పంపినట్లు సమాచారం. ఎంట్రీ వద్ద దీనిని స్కాన్ చేసిన తర్వాతే లోపలికి అనుమతించబోతున్నారు. అలాగే ఆహ్వాన పత్రిక మరియు క్యూఆర్ కోడ్ లేని అభిమానులు, ఇతరులు ఎవరూ వేదిక వద్దకు రావద్దని టీమ్ విరోష్ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. మరోవైపు ఈ వేడుక జరిగే ప్రాంతం మొత్తం పోలీసుల పర్యవేక్షణలో ఉంటుందని, భద్రతా కారణాల దృష్ట్యా ఎవరినీ అనుమతించ బోమని స్పష్టం చేశారు. అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతల దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



# పెద్ది సినిమా రన్‌టైమ్‌పై ఊహాగానాలు

## ఆ వార్తలను కొట్టి పారేసిన చిత్రబృందం

ప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ నిడివి గల సినిమాల ట్రెండ్ నడుస్తోంది. కంటెంట్ బలంగా ఉంటే మూడు గంటలకు పైగా రన్ టైం ఉన్నా ప్రేక్షకులు ఆదరిస్తారని రీసెంట్‌గా 'పుష్ప 2' నిరూపించింది. ఈ క్రమంలోనే సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కూడా 3 గంటల కంటే ఎక్కువ నిడివితో ఉండబోతోందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. సినిమా రఫ్ కట్ ఏకంగా 4 గంటలకు పైగా వచ్చిందని, ఎడిటింగ్ తర్వాత కూడా అది 3 గంటల పైనే ఉంటుందని ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాలు కొట్టిపారేశాయి. సినిమా నిడివి గురించి వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, అభిమానులు వీటిని నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. షూటింగ్ దశలో ఉన్న సినిమా రన్ టైం గురించి ఇప్పుడే మాట్లాడటం సరికాదని, దర్శకుడు బుచ్చిబాబు ఒక పక్కా ప్లానింగ్‌తో సినిమాను రూపొందిస్తున్నారని తెలిపారు. ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆడియన్స్‌కు బోర్ కొట్టకుండా సరైన నిడివితోనే వస్తుందని భరోసా ఇచ్చారు. వృద్ధి సినిమాస్ పతాకంపై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై నేషనల్ లెవెల్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. చరణ్ ఒక విభిన్నమైన లుక్‌లో కనిపిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.








# ప్రేక్షకులను ఆకట్టుకున్న రాధికశరత్ కుమార్ కొత్త చిత్రం - తాయి కిళవి

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) మార్చ్ 3 :**
రాధిక ప్రధాన పాత్రలో నటించిన తాజా తమిళ చిత్రం ' తాయి కిళవి ' కోలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తమిళ స్టార్ హీరో శివ కార్తికేయన్ నిర్మించిన ఈ సినిమాకు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించారు. అరుళ్ దాస్, బాల శరవణన్, సింగంపులి, మునిష్కాంత్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 27న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ చిత్రంలో రాధికా పూర్తిగా భిన్నమైన గెటప్‌లో కనిపించడం ప్రధాన ఆకర్షణగా మారింది. ఈ మేకప్ కోసం ఆమె గంటల తరబడి కష్టపడ్డారు. 63 ఏళ్ల వయసులో రాధిక పడిన కష్టానికి తమిళ ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. తాయ్ కెలవి చిత్రం ఎక్స్ట్రార్డినరీ ఎంటర్‌టైనింగ్ మూవీ. సింప్లి అమేజింగ్. కొత్త నటీనటులు, అద్భుతమైన ప్రతిభతో ప్యాషినేట్ ఫిల్మ్ మేకర్ శివకార్తీకేయన్ అదరగొట్టారు. తొలి చిత్ర దర్శకుడు శివకుమార్ గర్వపడేలా తన సినిమాను అందించారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫి: వివేక్ విజయ్ కుమార్, ఎడిటర్: సాన్ లోకేష్, మ్యూజిక్: నివాస్ ప్రసన్న, ప్రొడక్షన్ డిజైనర్: రాము తంగరాజ్ బాధ్యతలను నిర్వర్తించారు.

# 5న వృషకర్మ గ్లింప్స్ విడుదల

అక్కినేని నాగచైతన్య హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ'. 'విరూపాక్ష' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దీనిపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఈ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్వహించేందుకు మేకర్స్ ఒక ఆసక్తికరమైన వేదికను ఎంచుకున్నారు. ఈ నెల 5న విడుదల కానున్న 'వృషకర్మ' గ్లింప్స్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పి సి ఎక్స్ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నారు.గురువారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కేవలం మీడియా ప్రతినిధులు మాత్రమే కాకుండా, పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు కూడా ఈ ఈవెంట్‌కు హాజరుకానున్నారు. భారీ స్కేల్‌తో, హై టెక్నికల్ వాల్యూస్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ గ్లింప్స్ చైతు కెరీర్‌లోనే ఒక కొత్త మైలురాయిగా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




# లావణ్య త్రిపాఠి..సతీలీలావతి విడుదల వాయిదా

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సతీ లీలావతి' విడుదల వాయిదా పడింది. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకుంది. నరేష్, వీటీవీ గణెళిష్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేశారు. మొదటగా మార్చి 6న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే విడుదలకు సమీపిస్తున్న వేళ అనూహ్య పరిణామాలు చోటుచేసు కోవడంతో రిలీజ్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దుర్గాదేవి పిక్చర్స్ విడుదల చేసిన ప్రకటనలో, 'లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'సతీ లీలావతి' చిత్రాన్ని మార్చి 6న విడుదల చేయాలని భావించాం. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల




నిర్ణయించిన తేదీన విడుదల సాధ్యంకాలేదు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం. ఎలాంటి రాజీ లేకుండా, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా చిత్రాన్ని సిద్ధం చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథను మలిచినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'శివ మనసులో శ్రుతి', 'శంకర' వంటి చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు తాతినేని సత్య ఈసారి పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అందించనున్నారని తెలుస్తోంది. ఇక లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత విడుదలవుతున్న తొలి చిత్రం కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఆమె కొత్త లుక్, పాత్రలోని వైవిధ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని యూనిట్ నమ్మకంగా చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై హైప్ పెరిగింది. వాయిదా వార్త అభిమానులను కొంత నిరాశకు గురి చేసినప్పటికీ, క్వాలిటీ కోసం తీసుకున్న నిర్ణయమని మేకర్స్ స్పష్టం చేయడంతో సినీ ప్రియులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- వడదెబ్బకు ముందే అప్రమత్తత అవసరం
- గ్రామాల్లో మంచినీరు, పశుగ్రాసం ప్రణాళికలు ముఖ్యం

**విజయవాడ,మార్చి3( వెలుతురు):**
వేసవి రాకముందే రాష్ట్రంలో ఎండలు మండుతున్న తీరు చర్చనీయాంశం గా మారింది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో 35 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం నాడు పలు రాయలసీమ జిల్లాలతో పాటు, కోస్తా జిల్లాల్లో కూడా 35 నుండి 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసినప్పటికీ అత్యధిక జిల్లాల్లో సూర్య ప్రతాపమే కొనసాగింది. వాతావరణ శాఖ జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ ఏడాది మార్చి నెలలో వేసవి కాలం ప్రారంభమై మే నెలాఖరు వరకు కొనసాగాల్సి ఉండగా ఫిబ్రవరి నెలలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకరం. కొన్ని సంవత్సరాలు గా దేశవ్యాప్తంగా వాతావరణంలో ఈ తరహా మార్పులు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం భారతదేశ చరిత్రలో అత్యంత వేడి నమోదైన సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. ఆ సంవత్సరం మన రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత సుమారు 1 నుండి 1.5 డిగ్రీల వరకు అధికంగా నమోదైనట్లు వాతావరణ విభాగ విశ్లేషణలు చెబుతున్నాయి. గత ఏడాది అనంతపురం, కర్నూలు, నంద్యాల, గుంటూరు జిల్లాలో 45 నుండి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, మార్చి నెల మధ్యలోనో, ఏప్రిల్ ప్రారంభం నుండో మండే ఎండలు ఈ సారి ఫిబ్రవరిలోనే ప్రారంభం కావడం ముందస్తు హెచ్చరికగా భావించక



తప్పదు. ఒక అధ్యయనం ప్రకారం 2010 తరువాత ప్రతి ఐదు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. వడ గాలుల తీవ్రత, అవి కొనసాగే కాలవ్యవధి పెరుగుతోంది. ఆ క్రమంలోనే 2024 వేసవిలో దేశవ్యాప్తంగా వడదెబ్బ కేసులు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాల ప్రకారం, దేశ వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా వందల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. మన రాష్ట్రంలో కూడా గత వేసవిలో వడదెబ్బ కారణంగా రెండు డజన్లకు పైగా మరణాలు నమోదైనట్లు సమాచారం. ఇటువంటి ఉత్పాతాలు కేవలం వైద్య, ఆరోగ్య పరమైన అంశాలనే కాదు. సామాజిక అసమానతల్ని కూడా బట్టబయలు చేస్తాయి. నిర్మాణరంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికులు, రోడ్లపై చిన్నా చితక పనులు చేస్తూ పొట్ట పోసుకునే కష్టజీవులే వడదెబ్బ, వేడి గాలుల బాధితుల్లో అధిక సంఖ్యలో ఉండటం ఈ వాస్తవాన్నే విదితం చేస్తోంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకోవడమన్నది ఏటా చూస్తూనే ఉన్నాం. దీనిని అర్థం చేసుకోవడం నివారణ చర్యలు తీసుకోవడం ఇప్పుడు తప్పనిసరిగా మారిన ఒక సామాజిక బాధ్యత. ఉష్ణోగ్రతలు ఏటికేడాది వరుసగా రికార్డులు బద్దలు కొడుతూ, మరణాల సంఖ్య పెరుగుతున్నాయి. పెరిగే ఎండలు ప్రజలకు తాగునీరు, సాగునీటి అవసరాల పైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. భూగర్భజలాలు తీవ్రంగా క్షీణించడం, విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. వీటిని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం తక్షణం వేసవి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. ఈ యాక్షన్ ప్లాన్లు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు అమలయ్యేలా చూడాలి. ముందస్తు హెచ్చరికలు, పనివేళల్లో మార్పులు, తాగునీటిని అందుబాటులో ఉంచడం, గ్రీన్ కవర్ పెంచడం, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతుందన్నది అనేక దేశాల్లో, కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే నిరూపితమైన సత్యం. ప్రభుత్వం ఈ విషయమై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి సంవత్సరం చోటుచేసుకుంటున్న ఈ వైపరీత్యాన్ని నిరక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చని అంటున్నారు.

## అమెజాన్ డేటా సంటర్లపై డ్రోన్ దాడి

- ధృవీకరించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్




**టెహ్రాన్, మార్చి3( వెలుతురు):**
అమెరికా– ఇజ్రాయెల్ సైనిక చర్యలకు ప్రతీకారంగా పశ్చిమాసియాపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలో అక్కడి అమెజాన్ డేటా సెంటర్‌లపై డ్రోన్ దాడులు జరిగినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ దాడులు నిజమేనని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ధ్రువీకరించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని తమ రెండు డేటా సెంటర్లను డ్రోన్‌లు నేరుగా ఢీకొట్టాయని అమెజాన్ పేర్కొంది. దీంతో పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ సర్వీసుల్లో అంతరాయం కలిగినట్లు తెలిపింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్ సమీపంలో జరిగిన దాడి వల్ల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో ఉద్యోగులు ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనే విషయం గురించి సంస్థ స్పష్టం చేయలేదు. సర్వీసుల పునరుద్ధరణకు తమ సిబ్బంది స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పింది. సర్వీసుల్లో అంతరాయం కారణంగా ప్రభావితమైన వినియోగదారులు కీలకమైన డేటాను బ్యాకప్ చేసుకొని.. ఇతర ప్రాంతాల్లోని అమెజాన్ సర్వీసులకు మారాలని సూచించింది.

## క్షేమంగా ఇండియా చేరుకున్న పివి సింధు

- బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన షట్లర్




**బెంగళూరు,మార్చి3( వెలుతురు):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు. ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.

## యుద్ధవేళ..ఇరాన్‌లో భూకంపం

**టెహ్రాన్,మార్చి3( వెలుతురు):**
ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడులతో హడలెత్తిస్తున్న వేళ ఇరాన్‌ను భూకంపం కూడా వణికిస్తోంది. ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో కాసేపటి క్రితం 4.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. గెరాష్ సమీప ప్రాంతంలో భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు గుర్తించారు. ఈ భూకంపం వల్ల జరిగిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం గురించి వివరాలు బయటకు రాలేదు. కాగా, మరోవైపు ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న కెర్మాన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో కనీసం 13 మంది ఇరాన్ సైనికులు మరణించారని స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులు చేస్తోంది.

## స్థిరంగా బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మార్చి3( వెలుతురు):**



అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి. యుద్ధం కారణంగా మరింత భారీగా పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. మార్చి 3న మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,70,500 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,290 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,70,650కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,56,440కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్‌ను దాటేసింది.

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

- పాలకల్తీకి ప్రభుత్వానిదే బాధ్యత
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**భద్రాచలం,మార్చి3( వెలుతురు):**
భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణాకు ఇవ్వాలని సీపీఐ తరపున కోరుతున్నామని సిపి జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. విభజన సందర్భంగా ఎపిలు కలిపిన ఆ ఐదు గ్రామాలు తెలంగాణలో తిరిగి విలీనం చేయాలన్నరు. లేకుంటే తీవ్ర సమస్యలు వస్తాన్నారు. ధార్మిక సంస్థల్లో కఠినమైన పాలసీలు తీసుకురావటం ద్వారానే లడ్డూ కల్తీ లాంటి సమస్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిజాయితీగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరని, శ్రీలక్ష్మి చేసిన చిన్న తప్పిదం వలన ఆమె కెరీర్ దెబ్బతిందన్నారు. బాద్యతాయుతంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రలోభాలకు లొంగడంతోనే వ్యవస్తలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ లో జరిగిన దుర్ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని నారాయణ పేర్కొన్నారు. కల్తీ పాలు తాగటం వలన ప్రజలు



చనిపోతున్నారని, డెయిరీలపై ప్రభుత్వ నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. నక్సలైట్లను చంపవచ్చు కానీ నక్సలిజాన్ని అంతం చేయలేరన్నారు. పేదరిక నిర్మూలన జరిగితే నక్సలిజం అవసరమే రాదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అణగదొక్కాలని అవినీతి మరక అంటించారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆరు వేల కోట్లు ఉన్నాయని.. రెండు వేల కోట్లు విడుదల చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ కేసును సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వానికి అప్పగించాలని నారాయణ కోరారు. అమెరికాకు ఎవరు ఎదురు తిరిగినా వారిపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులకు దిగడం దారుణమని సీపీఐ జాతీయ నేత నారాయణ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇరాన్ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకునే ప్రయత్నంగా యుద్ధం చేస్తుందన్నారు. దురాక్రమణ చేసేందుకే పలు కారణాలు చూపి యుద్ధం ప్రారంభించిందని అమెరికాపై మండిపడ్డారు. ప్రధాని మోడీ చొరవ తీసుకుని ప్రపంచ దేశాల సమన్వయంతో ట్రంప్‌తో మాట్లాడి యుద్ధం ఆపేలా ప్రయత్నం చేయాలని కోరారు.

## జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో దారుణ ఘటన

- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న మాజీమంత్రి

**మహబూబ్‌నగర్,మార్చి3( వెలుతురు):**
జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్ని కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు



లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించు కోవడం లేదని వెల్లడించారు. కనీస సౌకర్యాలు కల్పించక హాస్పిటళ్లు దీనావస్థకు చేరుకుంటున్నాయని వివరించారు. వసతులు లేవు. మందులు లేవని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటళ్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త హాస్పిటల్స్ నిర్మించాం.పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని వెల్లడించారు. పాత రోజులు తెస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిజం చేసిందన్నారు. కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ పూర్తి అయినా వాడుకోలేదని పేర్కొన్నారు. మార్చురీని ఎందుకు మార్చలేదని, పాత దాంట్లో ఫ్రీజర్,స్ట్రెచర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలన గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, జడ్చర్లలో స్థలాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం సొంత జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇన్‌ఛార్జ్ గా ఉన్న జిల్లాలో ఇంతటి దుస్థితి నెలకొనడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజలు సమస్యను వివరిస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు.

## జంట హత్య కలకలం

- భార్య, అత్తను హతమర్చిన దుండగుడు

**కాకినాడ,మార్చి 3( వెలుతురు):**
తూర్పుగోదావరి జిల్లాలో దారుణం జరిగింది. ఓ వ్యక్తి తన భార్య, అత్తను కత్తితో నరికి చంపాడు. సీతానగరం మండలం బొబ్బిలంకలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను లత, లక్ష్మిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..




సోడదాసి సీతారామరాజు, లత ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లత తన తల్లి లక్ష్మి ఇంట్లో ఉంటోంది. సోమవారం అర్ధరాత్రి అత్తగారింటికి వెళ్లిన సీతారామరాజు.. లత, లక్ష్మిలను కిరాతకంగా నరికి చంపాడు. కుటుంబ విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన మొదటి భార్యతో పాటు అత్తను కత్తితో నరికి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జననివాస ప్రాంతాల్లో ఈ ఘటన జరగడంతో భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. చోడదాసి సీతారామరాజు తన మొదటి భార్య లత (30), అత్త గుమ్మడి లక్ష్మి (50)పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నేరానికి ఉపయోగించిన కత్తిని గోదావరిలో పడేసి సీతానగరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. 15 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్న సీతారామరాజు, లతలకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా కొంతకాలంగా విడిగా ఉంటున్నప్పటికీ.. ఒకే వీధిలో నివసిస్తున్నారు. నిందితుడు సీతారామరాజు ప్రస్తుతం మరో మహిళను వివాహం చేసుకున్నాడు. భార్యపై అనుమానమే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలోనూ ఓ హత్య కేసులో జైలుకెళ్లి వచ్చినట్లు చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కోనసీమలో ఫైర్ క్రాకర్స్ షాపులపై దాడి

- అనుమతి లేని షాపులను సీజ్ చేసిన అధికారులు

**అంబేద్కర్ కోనసీమ,మార్చి 3( వెలుతురు):**
అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఫైర్ క్రాకర్స్ షాపులు, తయారీ కేంద్రాలపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. అమలాపురంలో ఫైర్ క్రాకర్స్ తయారీ కేంద్రాలను పరిశీంచిన డీఎస్పీ ప్రసాద్.. అనుమతులు లేకుండా నడుస్తున్న షాపులను సీజ్ చేశారు. ఇటీవల వేట్లపాలెంలో జరిగిన ÷ర్ క్రాకర్స్ యాక్సిడెంట్ నేపథ్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అమలాపురంలో దీపావళి మందుల తయారీ, అమ్మకాలపై కఠిన నియంత్రణలు అమలు చేస్తున్నారు. అమలాపురం డివిజన్‌లోని ఐదు షాపులకు అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు డీఎస్పీ. కలెక్టర్ నుంచి తగిన అనుమతులు పొందిన తర్వాత మాత్రమే షాపులు తెరవాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ÷ర్ క్రాకర్స్ తయారీ లేదా అమ్మకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com